J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 40 10.03.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## గోబెల్స్ ప్రచారానికి...
# గ్లోబల్ సమ్మిట్‌తో సమాధానం

- ఫలించిన జగన్ వ్యూహం - విశాఖ వేదికగా వ్యాపార ఒప్పందాల ప్రవాహం
- పెట్టుబడులు.. కట్టుబడులు దాకా వస్తే.. ఆంధ్రకు బంగారు భవిష్యత్తే!
- ఎప్పుడో చేయవలసిన పని.. ఇప్పటికైనా చేశారు...!

### మేధావులారా.. అమ్ముడుపోకండి

ఓటుకు నోటు తీసుకుని
విలువలకు వేటు వేయకండి

3లో

ఆంధ్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ప్రతిపక్షాలకి ఝలక్ ఇచ్చారు. ఓ వైపు... ఏపీలో అభివృద్ధే లేదు, పారిశ్రామిక ప్రగతి కుంటుపడింది అని ప్రతిపక్షాలన్నీ ముక్తకంఠంతో ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నాయి. మరోవైపు రాష్ట్రంలో పరిశ్రమలు రాలేదు, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించలేదు అంటూ నారా వారసుడు లోకేష్ తన పాదయాత్రలో గగ్గోలు పెడుతున్నాడు. ఇదే తరుణంలో విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సు నిర్వహించి 'గోబెల్స్' ప్రచారం చేస్తున్న వారి నోళ్ళు మూయించడానికే గట్టి ప్రయత్నం చేశారు సీఎం జగన్. ఇది ఆషామాషీ సదస్సు కాదు. భారతదేశంలోని పారిశ్రామిక దిగ్గజాలతో పాటు ప్రపంచ పారిశ్రామిక రంగం సైతం ఔరా అంటూ ఆంధ్రా వైపు చూసేలా ఈ పెట్టుబడిదారుల సదస్సుని ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహించింది జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం.

### 13 లక్షలకోట్ల పెట్టుబడులు!

13లక్షలా 41వేలా, 734 కోట్ల రూపాయల పెట్టుబడులకు ఒప్పందాలు. ఔరా...! ఇది నిజమా ..? లేక కలా..?? అన్న రీతిలో ఆంధ్రాలో భారీ పెట్టుబడులు పెట్టడానికి కేవలం రెండురోజుల్లో ఒప్పందాలు కుదిరాయి. ఇది అసామాన్యమైన సంఘటన. అనితర సాధ్యమైన ఘన కార్యం. నెవెర్ బిఫోర్.. అన్నట్లుగా గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని విచిత్రం. భారతదేశంలో ఇప్పటివరకూ ఏ ప్రభుత్వం సాధించని, సాధించలేని అనూహ్య విజయం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి త్వరలో 4 సంవత్సరాలు పూర్తి కావస్తోంది. మరో ఏడాదిలో ఎన్నికలు రాబోతున్నాయి. ఇంకా ముందొచ్చినా ఆశ్చర్యపోనవసరంలేదు. ఇప్పుడు ఈ పదమూడున్నర లక్షల కోట్లలో కనీసం 25 శాతం ఎన్నికలనాటికి కార్యరూపం దాల్చినా జగన్‌మోహన్‌రెడ్డి కోరిక నెరవేరినట్లే. ఆయన కోరుకున్నట్లుగా జనం ఆయనను 175కి 175 సీట్లతో దీవించినా దీవించవచ్చు. ఇదే పని ఆయన ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్ళలో చేసివున్నా ఈ సరికే రాష్ట్ర స్వరూపమే మారిపోయివుండేది. అప్పట్లో 175కి 151 అసెంబ్లీ, 25కి 22 పార్లమెంట్లు సాధించిన యువ ముఖ్యమంత్రిగా ఆయన పేరు దేశ రాజకీయాలలో మారుమోగిపోయింది. ఆ ఇమేజ్‌తో ఇంతకంటే ఎక్కువ మొత్తంలోనే పెట్టుబడులు సాధించి ఉండొచ్చు. మరి ఇన్నాళ్లూ ఊరక

10లో



# జనరంజకంగా మోడీ పాలన

**- కేంద్రమంత్రి మురుగన్**



ప్రధాని నరేంద్రమోడీ పాలనలో దేశవ్యాప్తంగా అన్ని రంగాల్లో అనేక సంస్కరణలు జరుగుతున్నాయని, మోడీ పాలన సకల జన రంజకంగా ఉండడంతో దేశవ్యాప్తంగా మోడీ పట్ల, బిజెపి పట్ల ప్రజల ఆదరణ మరింతగా పెరుగుతోందని కేంద్ర పశుసంవర్ధక, మత్స్య, సమాచార ప్రసారశాఖల మంత్రి ఎల్.మురుగన్ చెప్పారు. ఈనెల 6న ఆయన నెల్లూరులో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. కేంద్రం నుంచి వస్తున్న నిధులతోనే రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అయితే ఆ పథకాలకు పేర్లు మార్చి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మభ్య పెడుతోందని ఆయన విమర్శించారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విఫలమయ్యారన్నారు. దేశంలో మత్స్యశాఖ, పశుసంవర్ధకశాఖల అభివృద్ధి కోసం ప్రధాని మోడీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. దేశంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రధాని మోడీ ఎంతగానో కృషిచేస్తున్నారన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అనంతరం వేదాయపాళెంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారంలో పాల్గొన్నారు. బిజెపి నాయకులు వాకాటి నారాయణ రెడ్డి, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, భరత్‌కుమార్‌యాదవ్‌తో పాటు ఎమ్మెల్సీ అభ్యర్థులు దయాకర్‌రెడ్డి, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

# ధర్మ పరిరక్షణే ధ్యేయం

**- భజరంగదళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి**



హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి), భజరంగదళ్‌లు నిరంతరం కృషి చేస్తున్నాయని రాష్ట్ర భజరంగదళ్ కన్వీనర్ టి.ప్రతాప్‌రెడ్డి చెప్పారు. కావలిలోని విహెచ్‌పి కార్యాలయంలో ఈనెల 5న జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా దేవాలయాల పరిరక్షణకు, సత్సంగాల నిర్వహణకు తాము అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా, ఈనెల 12 నుంచి 19వ తేది వరకు రాష్ట్రవ్యాప్తంగా హిందూ స్మశానాలను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో విహెచ్‌పి జిల్లా కోశాధికారి సుబ్బరాయుడు, ఉపాధ్యక్షుడు నరసింహారావు, నగర కార్యదర్శి కోట సురేంద్రరెడ్డి, సహ కార్యదర్శి లోకేష్‌రెడ్డి, భజరంగదళ్ జిల్లా కన్వీనర్ నాగరాజు, కో-కన్వీనర్ నరసింహ తేజ, సంజీవరెడ్డి, చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తూకాల మోసాలపై కొరడా

## తేడాలున్న మిషన్లు సీజ్

మార్కెట్లలో తూకపు మోసాలపై తూనికలు కొలతల అధికారులు కొరడా ఝుళిపించారు. ఇటీవల బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ఉన్న చేపలు, మాంసంపై దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. తప్పుడు తూకాలతో ఉన్న 20 కాటాలను సీజ్ చేశారు. కేజీకి 100 గ్రాముల నుంచి 150 గ్రాముల దాకా తేడా ఉంటున్నట్లు అధికారులు గుర్తించారు. వినియోగదారులను మోసగిస్తున్న వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా తూకాల్లో తేడాలు గుర్తించి, ఆ తూకపు మిషన్లను సీజ్ చేసి, కేసులు నమోదుచేశారు. తాము తనిఖీలకు వస్తున్నామని తెలిసినప్పుడల్లా దుకాణాదారులు అనేకమంది షాపులు మూసేస్తున్నారని, సక్రమంగా తూకాలు నిర్వహిస్తున్నప్పుడు షాపులు ఎందుకు మూయాలని వారు ప్రశ్నించారు. ఈ దాడులు తరచూ జరుగుతుంటాయన్నారు. ఎక్కడైనా దుకాణాల్లో తక్కువ తూకాలు వేస్తున్నట్లు గమనిస్తే, వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## బ్రాహ్మణ సేవా సంఘానికి..

# కొత్త కార్యవర్గం

నెల్లూరులోని దక్షిణ సింహపురి బ్రాహ్మణ సేవాసంఘానికి ఈనెల 5న కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్షులుగా తేకూరు సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా ఆర్‌వివిఎస్‌వి ప్రసాదరావు, కోశాధికారిగా టివి మధుసూదన్‌రావుతోపాటు నలుగురు ఉపాధ్యక్షులుగా, ముగ్గురు సంయుక్త కార్యదర్శులుగా, మరో 10 మంది కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణ విశ్రాంత రైల్వే ఉద్యోగి పుష్పగిరి లక్ష్మీ నరసింహ ప్రకాశం వ్యవహరించారు.

# పోరాటాలతోనే మహిళా సాధికారత

**- ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం**



మహిళల అభ్యున్నతి కోసం, వారికి సాధికారత-సమానత్వం లభించేలా పోరాటాలు చేయాలని, పోరాటాలతోనే సాధికారత సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో మహిళాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఇటీవలి కాలంలో మహిళలు అన్నిరంగాల్లో ముందుండడం సంతోషకరమన్నారు. మహిళల పోరాటాలకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తిచేశారు. జేవీవీ సమతా విభాగం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం మహిళా విభాగం కన్వీనర్ మాళవిక చక్రవర్తి, సైకాలజీ ప్రొఫెసర్ రంజిత నళిని, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు విజయలక్ష్మి, అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకురాళ్ళు సుజాతమ్మ, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే నెలనుంచే సమస్యలపై సమరం

**- ఏపీ జీఇఎ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ**



ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై ఏప్రిల్ నుంచి సమరం ప్రారంభించనున్నామని ఏపీ జీఇఎ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ చెప్పారు. ఈనెల 6న ఆయన నెల్లూరులో ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ, ఉద్యోగులకు సంబంధించి దాదాపు 12వేల కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఒక్కో ఉద్యోగికి రెండున్నర లక్షల నుంచి మూడున్నర లక్షల రూపాయల దాకా రావాల్సివుందని, ఆ డబ్బును వెంటనే చెల్లించేందుకు ప్రభుత్వం కృషిచేయాలని కోరారు. తామేమీ తీవ్రవాదులం కాదని, డబ్బులు అడిగేందుకే గవర్నర్ వద్దకు వెళ్ళామని, అందుకు తమకు షోకాజ్ నోటీస్ ఇచ్చారని ఆయన అన్నారు. 12 నెలలుగా సిపిఎస్ ఉద్యోగుల ఖాతాకు చెల్లించాల్సిన మదుపు డబ్బులు వారి జీతాల నుంచి తగ్గిస్తున్నా, ఆ డబ్బులు మాత్రం జమచేయడం లేదని, ఇదెక్కడి అన్యాయమని ఆయన ప్రశ్నించారు. ఈ సమస్యలన్నిటిపై పోరాటం తప్పదన్నారు. ఇకనైనా ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలన్నారు.

ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీపతి, పిఆర్‌టియు రాష్ట్ర సహాధ్యక్షులు నాగేంద్రకుమార్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, మహిళావిభాగం కో-ఛైర్‌పర్సన్ సులోచన, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.రమణారెడ్డి, వై.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# నమ్మకానికి ప్రతీక.. ఎల్ఐసి

**- మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాస్**



ఎల్ఐసి (లైఫ్ ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అంటే ప్రజల నమ్మకానికి ఒక ప్రతీక అని, కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నడుస్తున్న ఎల్ఐసిలో ప్రజలు పాలసీల రూపంలో పెట్టుబడి పెట్టే ప్రతి రూపాయి సురక్షితమని ఎల్ఐసి జోనల్ మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాస్ చెప్పారు. ఈనెల 5న నెల్లూరులోని అన్నమయ్యసర్కిల్ వద్ద ఆ సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని ఎల్ఐసి ఏజెంట్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో 23 ప్రైవేట్ సంస్థలు ఇన్సురెన్స్ రంగంలో ఉన్నా, ఇప్పటికీ 70 శాతం వాటా ఎల్ఐసీదేనని, ఇన్సురెన్స్ రంగంలో ఎల్ఐసి నెంబర్-1గా నిలుస్తోందని అన్నారు. ఎల్ఐసి ఆస్తులు 44 లక్షల కోట్ల వరకు ఉన్నాయన్నారు. 5 లక్షలకు పైబడిన ప్రీమియంలకు మార్చి నెలలో పలు రాయితీలు కూడా ఉంటాయని తెలిపారు.

అనంతరం, ఎక్కువ పాలసీలు కట్టించిన పలువురు ఎల్ఐసి ఏజెంట్లను సన్మానించారు. ఎల్ఐసి నెల్లూరు డివిజన్ ఎస్ఎం దుర్గాప్రసాద్, బుచ్చిరెడ్డిపాళెం శాఖ మేనేజర్ బాలాజీబాబు, డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాలసుబ్రహ్మణ్యం, చలపతిరాజు, ఏఓ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రెక్కలు

ప్రాభవం ఓ అపురూపమైన
అద్వితీయ తీయని గురుతు
చిరకాలం గుర్తుండిపోయే కమ్మని జ్ఞాపకం
తేనెటీగల గూడు కట్టుకొని
తేనెల ఆస్తుల మకరందాన్ని కూటుకట్టినట్లు
వర్తక వాణిజ్య విహాయస యాత్రలో
ఏళ్లకు ఏళ్ళు కాళ్ళ క్రింద నలిగిపోతే
బంగారానికి పుటం పెట్టి దగద్ధాయమైనట్లు
కాలం దివిటీ వెలిగించి సుసారవంతమైన
సార్థక ప్రాభవాన్ని అంబారీ మీద మోసుకొస్తుంది.
చినుకుల్లా రాలి వాగుల్లా నిండగానే
తేజోవంతమయిన ప్రకాశమై వికాసం
వెల్లువెత్తదు.
చినుకు చినుకు మడికట్టి బంజరుభూమిని
మేలైన కాల్వతో బంగరు పంట పండిస్తే
మహత్తరమైన పునరుత్తేజం సాష్టాంగ
పడ్డట్టు నమస్కరిస్తుంది.
ఈ ప్రక్రియలో ఏ క్షణం ఏమరుపాటు ఎదురైతే
కరోనాలో చైనా డీలాపడ్డట్టు ధ్వనిస్తుంది.
అప్రమత్తతో వడిసిపట్టుకొని దుందుభికేసి
చూడకపోతే
పాకిస్తాన్ పాదిలో కౌగిలింత భ్రాంతవుతుంది
వైజ్ఞానిక విజయాంతర శ్రమాంతర శక్తి జతకడ్తే
వడివడిగా విజయాల విహాయసం దివిటీలా
కిరీటమై భాసిస్తుంది.
నెలవంకల్ని వంచి త్రుంచి
జేబుకు అలంకరించుకొనే సామర్థ్యరచనతోనే
పతాకాలు పరవశిస్తాయి.
మార్గాన్వేషణలో నిరంతరం స్పృహకోల్పోతే
నక్షత్ర రహదారి పూలతెమ్మెరయై
కమ్మని వాసనల స్వాగతం పల్కుతుంది.
వైభవం ఊరంతా తిరిగొచ్చేలోగానే
ప్రాభవం ఓ చుంబనం అందించి ఆశ చూపిస్తుంది.
విజేతలు ఎప్పుడూ ఒంటరి పోరాటం చేయరు
విజేత శబ్దంలోనే సామూహికత నర్మగర్భత ఘోషిస్తుంది.
జన సాంద్రతని, జన సమీకరణని
ముందు నిల్పడమే విజేత విజయఘోషకు నిండైన అర్థం.
అకుంఠిత దీక్షా పరత్వానికి అలుపెరుగని
పిలుపు ఎదురుకోల నాట్యమాడి స్వాగతిస్తుంది.
ఊహల మలుపులపై శుభోదయాల్ని
ఆవిష్కరిస్తుంది.
మార్కెట్ తంత్రానికి కొత్త రెక్కలు తొడిగి
సరికొత్త ఆక్సిజన్ పొదిగి నవీన సమీకరణలు
పొదిగితే సరికొత్త వీణాతతంత్రులు
కమ్మని సంగీతానికి నెలవవుతాయి
కొత్త రెక్కలు
తారకమంత్రాన్ని విన్పిస్తాయి
వెలుగుల దుప్పట్లను కప్పుతాయి.



**- చిన్ని నారాయణరావు**
94402 02942



# మేధావులారా.. అమ్ముడుపోకండి

## ఓటుకు నోటు తీసుకుని విలువలకు వేటు వేయకండి

ఎన్నికలంటే డబ్బులు, దండకాలు, పంపకాలు. ఇదే తంతు. అది ఏ ఎన్నికైనా సరే, ఇదే పరంపర కొనసాగుతోంది. ఆఖరికి మార్చి 13న పట్టభద్రులతో పాటు ఉపాధ్యాయులకు సంబంధించి జరగబోయే శాసనమండలి ఎన్నికలలో కూడా ఇదే దరువు. కొంతమంది అభ్యర్థులు పంపకాల పేరుతో నిస్సిగ్గుగా దండకాలు చేస్తున్నారని తెలుస్తోంది. ఖర్చు పెట్టుకోగలిగిన స్థోమత తమకు ఉన్నా, తమ పార్టీ ఖర్చుల కోసం భారీగానే నిధులు సమకూర్చినా... రాష్ట్రంలో కొంతమంది అభ్యర్థులు, దండకమే ధ్యేయంగా పెట్టుకున్నారని వినికిడి. అధికార పార్టీ అభ్యర్థులు కూడా ఇదే పనిలో ఉండడం మరీ విడ్డూరం.

మేధావులారా ఆలోచించండి... మీ చదువు, సంస్కారం, మేధస్సు.. ఆఖరికి మీ ఓటును కూడా తాకట్టుపెట్టి ఈ సిగ్గుమాలిన నేతలు పబ్బం గడుపుకుంటున్నారు. దయచేసి విజ్ఞతతో ఆలోచించండి, విలువలను పాటించండి, నోటుకి కక్కుర్తిపడి విలువైన మీ ఓటుకి పోటు వేయకండి. జరగబోయేవి దేశాన్ని తమ విద్యానైపుణ్యంతో భవిష్యత్ వైపు నడిపించే పట్టభద్రుల ఎన్నికలు, లక్షలాది మంది భావిభారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయుల ఎన్నికలు.

***"మేధావులారా.. ఆలోచించి ఓటెయ్యండి, సమర్థతకి చోటివ్వండి"!*** - విహారి.



## 'జై రంగా! శ్రీ రంగా'!

నెల్లూరులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 9, గురువారం ఉదయం నుండి మధ్యాహ్నం దాకా అంగరంగవైభవంగా రథోత్సవం జరిగింది. వేలాదిమంది భక్తులు పాల్గొని 'జై రంగా! శ్రీరంగా' అంటూ రంగనాథస్వామిని దర్శించుకుని తరించారు.

## ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

### మహిళలకు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపు




'ఆత్మవిశ్వాసమే మన ఆయుధం. అపజయాలకు కుంగిపోకుండా, అవకాశాలను సద్వినియోగం చేసుకొంటూ జీవితంలో ముందుకు సాగాలని' టిటిడి ఉత్తర భారతదేశ ఆలయాల స్థానిక సలహా మండలి (న్యూఢిల్లీ) అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మహిళలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న నెల్లూరులోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్సీపి జిల్లా మహిళా విభాగం అధక్షురాలు మొయిళ్ల గౌరి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, మహిళలు నేటి సమాజంలో స్వయంకృషితో అంచలంచెలుగా ఎదుగుతూ అన్ని రంగాల్లో ముందంజ వేస్తుండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, వైఎస్సార్సీపి అధికారంలోకి వచ్చాక ప్రతి రంగంలో మహిళలకు ప్రాధాన్యత పెరిగిందని తెలిపారు. తొలుత ఆమె దివంగత మహానేత డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## శ్రీసిటీలో మహిళా దినోత్సవ వేడుకలు




అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న శ్రీసిటీలో వేడుకలు జరిగాయి. శ్రీసిటీలోని పలు పరిశ్రమల్లో మహిళా దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. మహిళా ఉద్యోగినులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి శుభాకాంక్షలు చెప్పారు. పరిశ్రమల్లో అంకితభావంతో పనిచేస్తున్నందుకు మహిళలందరికీ అభినందనలు తెలిపారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అకార్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ బృందా త్యాగరాజన్, మమతా సన్నారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని పారిశ్రామికాభివృద్ధిలో మహిళాశక్తిని కొనియాడారు. మహిళలను ప్రోత్సహిస్తున్న శ్రీసిటీ యాజమాన్యాన్ని అభినందించారు. శ్రీసిటీ రాకతో తమ జీవితాల్లో కొత్తకాంతులు వచ్చాయని, తమ జీవనోపాధికి వెలుగుబాటలు వేసిన శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డికి ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.





మార్చి 10వ తేదీ దంపతులు కాబోతున్న రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకులు కే.వి.రత్నం - పద్మావతి రత్నంల మనుమడు కొర్రపాటి వేణుగోపాల్ - రమల కుమారుడు సాయి రోహిత్ - లక్ష్మీ రోహితల సంగీత్ కార్యక్రమానికి హాజరై కాబోయే దంపతులను ఆశీర్వదించిన భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, వారి కుమార్తె దీపా వెంకట్




లాయర్
మార్చి 10, 2023

# ఈశాన్య రాష్ట్రాల్లో.. బిజెపి విజయభేరీ

ఒకప్పట్లో ఈశాన్య రాష్ట్రాల్లో కాలుమోపడానికే సందు లేనంత పరిస్థితి నుంచి బిజెపి ఇప్పుడు ఆ రాష్ట్రాల్లో విజయకేత నాలు ఎగురవేస్తోంది. అభివృద్ధి మంత్రంతో, జనాకర్షక నినాదాలతో, ఎక్కడికక్కడ అవసరమైన రాజకీయాలతో కలివిడిగా సాగిపోయి విజయభేరీ మోగిస్తోంది. భారత్ జోడో యాత్రతో దేశాన్ని చుట్టివచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి, మొత్తంగా కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికలు మరోసారి నిరాశనే కలిగించాయి. మోడీ విధానాలు అప్రజాస్వామిక మంటూ ధ్వజమెత్తుతున్న కాంగ్రెస్, బిజెపి పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని ఎంతగా ఊదరగొట్టినా వారి ఆశలు ఫలించలేదు. కొత్త అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాచికలేమీ పారలేదు. నాగాలాండ్‌లో అసలు ఒక్కస్థానాన్ని కూడా కాంగ్రెస్ సాధించలేకపోయింది. మొత్తంగా ఈ మూడు రాష్ట్రాల్లో జరిగిన 179 అసెంబ్లీ స్థానాల్లో కేవలం 8 సీట్లు మాత్రమే గెలుచుకుందంటే కాంగ్రెస్ పరిస్థితి ఎంత దీనంగా ఉందో తేటతెల్లమవుతోంది. దీంతో భవిష్యత్తులో కాంగ్రెస్ పరిస్థితి ఎలా ఉంటుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎవరే మనుకున్నా దేశంలో మోడీ ప్రభంజనం, బిజెపి హవా సాగిపో తోందన్నది మాత్రం వాస్తవమని ఈ ఎన్నికలు మరింతగా స్పష్టం చేస్తున్నాయనే అనుకోవచ్చు. దేశంలో ప్రధానంగా ప్రధాని మోడీ అనుసరిస్తున్న జాతీయ, అంతర్జాతీయస్థాయి విధానాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటూ, బిజెపి పట్ల ప్రజల్లో అభిమానాన్ని, ఆదరణను వెల్లువెత్తిస్తున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే, ఈ గెలుపులన్నీ మోడీ ఘనతలే అనుకోవచ్చు. ఎప్పుడూ గొడవలు, అనేక రకాల సమస్యలు, అశాంతి వాతావరణంతో అల్లకల్లోలంగా ఉండే ఈశాన్య రాష్ట్రాలకు బిజెపి శాంతిమంత్రం, అభివృద్ధి తంత్రం బాగా పనిచేశాయి. ఫలితంగా, ఇటీవల జరిగిన మూడు ఈశాన్య రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ(బిజెపి) తన హవా నిలుపు కుంది. త్రిపుర, నాగాలాండ్‌లో బిజెపి విజయం సాధించింది. మేఘాలయలో మాత్రం హంగ్ ఏర్పడింది. త్రిపుర అసెంబ్లీ స్థానాల్లో సగానికిపైగానే స్థానాలు(33) సాధించి, నాగాలాండ్‌లో 60 స్థానాలకు గాను 37 స్థానాల్లో బిజెపి కూటమి గెలవడంతో, కమలం పార్టీ వీచిన ఈశాన్య పవనాలు దేశ రాజకీయాల్లో మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. త్రిపురలో బిజెపి కూటమి 33 స్థానాలు సాధించి విజయభేరీ మోగించింది. కాంగ్రెస్-వామపక్ష పార్టీలకు 14, ఎన్‌సిఎఫ్‌కు 2 స్థానాలు మాత్రమే వచ్చాయి. అదేవిధంగా నాగాలాండ్‌లో బిజెపి కూటమి 37 స్థానాలతో అగ్రగామిగా నిలిస్తే, ఎన్‌పిపికి 4 ఎన్‌పిఎఫ్‌కి 2, ఇతరులకు 16 స్థానాలు లభించాయి. మేఘాలయలో బిజెపి వెనుకబడినా, ఇతరపార్టీలతో కలిసి అక్కడ అతిపెద్ద పార్టీగా ఉన్న నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి)కి ప్రభుత్వం ఏర్పాటుకు కొద్ది సీట్లు తక్కువ కావడంతో, ఆ పార్టీకి బిజెపి మద్దతునిచ్చింది. దీంతో ఇతరపార్టీలతో కలిసి ఎన్‌పిపి ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఏదేమైనా బిజెపి సాధిస్తున్న ఈ విజయాలు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి ఘన విజయానికి సోపానాలవుతాయని వేరే చెప్పనక్కర లేదు. త్రిపురలో రెండవసారి కూడా విజయఢంకా మోగించడం, నాగాలాండ్‌లో ఇతర పార్టీలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వంగా ఆవిర్భవించడం, మేఘాలయలో ముఖ్యమంత్రి సంగ్మా పార్టీతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం బిజెపికి అన్నివిధాలుగా కలిసివచ్చిన అదృష్టాలయ్యాయి. ఆయా రాష్ట్రాల్లోని స్థానిక రాజకీయాలను ప్రభావితం చేస్తూ బిజెపి తనదైనశైలిలో దూసుకువెళ్తోంది. ప్రధాని మోడీ, అమిత్‌షాల ద్వయం రాజకీయోపాయాలకు కాంగ్రెస్, వామపక్ష పార్టీలు గల్లంతైపోతున్నాయి. నాగాలాండ్‌లోనూ గతంలో కంటే ఇప్పుడు బిజెపికి బాగా ఆదరణ పెరిగిందన్నది ఈ ఎన్నికల ద్వారా తేటతెల్లమవుతుంది. త్రిపురలో సిపిఎం ప్రభావం మునుపటికన్నా తగ్గిపోయింది. మేఘాలయలో బిజెపికి ప్రతికూల వాతావరణం ఉన్నా శాయశక్తులా పోరాడింది. రెండు స్థానాలకే ఇక్కడ పరిమితమైపోయినా భవిష్యత్తులో కమలానికి భవిష్యత్తు ఉంటుందనే నమ్మకంతో బిజెపి ఆ ప్రాంతాల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇస్తూ ఉంది. ఆ ఆశావహ దృక్పథమే బిజెపి ముందడుగుకు కారణమవుతోంది. కష్టే ఫలీ..అన్నట్లుగా బిజెపి ముందుకు సాగిపోతోంది. త్వరలోనే కర్నాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోనూ ఎన్నికలు జరగనున్నాయి. బిజెపి ఎప్పటినుంచో అక్కడ గెలుపుకు బాటలు వేసుకుంటోంది. ఇకనైనా మేలుకొని కష్టపడకుంటే, రానున్న ఆ ఎన్నికలు కూడా ప్రతిపక్షాలకు పెద్ద సవాల్‌గానే పరిణమించనున్నాయని అనుకోవచ్చు.

# గుట్కాలు.. 'నమిలేస్తాయ్'



'ఏ రాయైతేనేం..పళ్ళు రాలగొట్టుకోవడానికి?'..అనే మోటు సామెతను మనం తరచూ వింటుంటాం. మత్తు పదార్థాలకు అది బాగా సరిపో తుంది. రకరకాల పేర్లు, రూపాలు వాటికి ఉంటాయి. కానీ, అన్నిటి లక్షణం ఒక్కటే.. బాగున్నోళ్లని చెడగొట్టడమే. అదేవిధంగా..గుట్కా, ఖైనీ, జర్దా, పాన్‌పరాగ్. పేర్లేవైతేనేం.. అన్నీ ఆరోగ్యాన్ని నాశనం చేసేవే. వాటికి దూరంగా ఉండాలని ఎవరెంతగా చెప్పినా వాటిని నమిలేవారు ఆ అలవాటును వదులుకోలేకపోతున్నారు. ఆ బలహీనతే వ్యాపారులకు సొమ్ముగా మారుతోంది. దీంతో, ఇప్పుడు మార్కెట్లో ఎటుచూసినా గుట్కాలే ఎక్కువగా రాజ్యమేలుతున్నాయి. అనేకమంది సాధారణ ప్రజలు, మధ్యతరగతి వారు కూడా ఎక్కువగా వీటిని వాడేస్తున్నారు. గుట్కాలు నములుతుంటే.. మొదట్లో అదో రకమైన మత్తుగా..గమ్మత్తుగా ఉంటుంది. భలేగా ఉంది కదా అని సరదాగా వాటికి అలవాటు పడితే, అది వ్యసనమై పట్టుకుంటుంది. వాటిని నమలకుంటే వంట్లో వణుకువచ్చినంత పనవుతుంది. ఆ తర్వాత ఇక 'వదిలేదే లే' అంటూ ఆరో గ్యాన్ని పట్టి పీడిస్తుంది. వాటికి బానిసలైపోయి, ఆ గుట్కాలు లేకుండా బతకడం సాధ్యం కాదన్న దుస్థితి కూడా వచ్చేస్తుంది.

పొగాకు ఉత్పత్తుల్లో రకరకాలున్నాయి. పొగవచ్చే పొగాకు (ధూమపానం)తో పాటు, పొగరాని పొగాకుతోనూ ఎన్నో అనర్థాలున్నాయి. ఆరోగ్యానికి హానికలిగించే అలాంటి ఉత్పత్తులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి వాటినెప్పుడో నిషేధించాయి కూడా. అయినా, అవి దొడ్డిదారుల్లో మార్కెట్లలోకి వస్తూనే ఉన్నాయి. ఒక్క నెల్లూరనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా, దేశమంతటా కూడా ఇవి విచ్చలవిడిగా అమ్ముడవుతూనే ఉన్నాయి. చిన్నచిన్న ప్యాకెట్ల తోరణాలుగా అందంగా వేలాడుతూ దుకాణాల్లో కనపడుతుంటాయి. తక్కువ ధరతో దొరికేవి కాబట్టి, అదోరకమైన మత్తు కోసం

## సమస్యల తో 'రణం'

చాలామంది వాటిని కొనేసి నమిలేస్తుంటారు. అందులోనూ గుట్కాలు, ఖైనీల వంటివి మరీ ప్రమాదకరం. గుట్కాలు వేసుకునేవారు వాటిని వెంటనే నమిలేయకుండా, బుగ్గన పెట్టుకుని కొంచెం కొంచెం తింటూ, ఆ రసాన్ని ఆస్వాదిస్తుంటారు. దీంతో ఆ బుగ్గలు, నోరు అన్నీ పొక్కిపోయి చివరికి క్యాన్సర్‌కు దారితీస్తాయి.

సిగరెట్టు తాగితే పొగ బయటకు కనిపిస్తుందని, గుట్కాలైతే ఎవరికీ కనిపించ కుండా దాచిపెట్టుకుని, ఎప్పుడు వీలైతే అప్పుడల్లా నమిలేయడం సులభమని, పొగలేని పొగాకు ఉత్పత్తులకు చాలామంది పాఠశాల విద్యార్థులు, చిన్నవయసునుంచే వీటికి అలవాటుపడుతున్నారు. ఇవెంతో ప్రమాదకరమని, అవి నిషేధిత ఉత్పత్తులని వారికి చెప్పేవారెవరు?..ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ పిల్లలు ఇలాంటి వ్యసనాల బారినపడకుండా కాపాడుకోవాలే తప్ప మరో మార్గాంతరం లేదు. చాలా ప్రాంతాల్లో కాలేజీ కుర్రాళ్ళు, యువకులు అదొక ఫ్యాషన్‌గా ఫోజులిస్తూ గుట్కాలు చేతిలో పోసుకుని నములుతుంటారు. ఆ లాలాజలాన్నంతా ఎక్కడంటే అక్కడ ఊయడం వల్ల గోడలు, ఆ ప్రాంతాలన్నీ ఎర్రగా, పరమ అసహ్యంగా తయారవుతుంటాయి. ఈ జాడ్యాన్ని రూపుమాపేదెవరు?.. గుట్కాలు నమిలితే నోరు గబ్బుకొట్టడంతో పాటు, నోటికి-వొంటికి కూడా రకరకాల జబ్బులొస్తాయి. ఆరోగ్యమంతా మటాష్ అయిపోతుంది. అంతా నాశనమయ్యాక, ఈ గుట్కాలకు ఎందుకు అలవాటుపడ్డాం దేవుడా!..అని అప్పుడు ఏడవాల్సి వస్తుంది. గుట్కాలు వంటి నిషేధిత పొగాకు ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారకాలైన ప్రమాదకర వేలాదిరకాల రసాయనాలుంటాయని, వీటిని నమలడం వల్ల అనారోగ్యం తప్పదని నిపుణులు ఎంతోకాలంగా హెచ్చరిస్తున్నారు. అయినా ఎవరు పట్టించుకుంటు న్నారు కనుక?!.. వీటి వాడకం వల్ల తలకు, మెడకు, గొంతుకు, అన్నవాహికకు, పళ్లకు రకరకాల సమస్యలు వస్తాయని, క్యాన్సర్‌తో సహా అనేకరకాల వ్యాధులు వచ్చేందుకు అవకాశం ఉందని, శరీరం అనారోగ్యంపాలై చివరికి ప్రాణంమీదికి వస్తుందని పదేపదే చెప్తున్నారు. మనదేశంలో దాదాపు 30 నుంచి 40 శాతం నోటి క్యాన్సర్ కేసులు వచ్చేది ఈ గుట్కాలు నమలడం వల్లనేనని స్పష్టం చేస్తున్నారు. అయినా వీటి వినియోగం తగ్గడమే లేదు. అంగళ్ళలో, పాన్‌షాపుల్లో తక్కువ ధరకే వచ్చేస్తున్న ఈ గుట్కాలు నిత్యం భారీస్థాయిలో మార్కెట్లకు తరలివస్తుంటాయి. పోలీసులు, అధికారులు ఎన్నిసార్లు దాడులు చేసినా, రావణాసురుని తలకాయల వలె ఇవి మళ్ళీ మళ్ళీ పుట్టుకొస్తూనే ఉన్నాయి. రానురాను ఇదో పెద్ద చీకటివ్యాపారంగా తయారైంది కూడా. ఇకనైనా ప్రభుత్వాలు, ఎక్కడికక్కడ పోలీసు ఉన్నతాధికారులు వీటిపై దృష్టిపెట్టి, ప్రజల ఆరోగ్యాన్ని సర్వనాశనం చేస్తున్న గుట్కాలు, ఖైనీల వంటివాటిపై కొరడా పట్టుకోవాలి. వాటిని అమ్మే మాఫియాలపై కఠినచర్యలు తీసుకుని, అవి మార్కెట్లలోకి రాకుండా ఎక్కడికక్కడ ఉక్కుపాదం మోపాలి. గుట్కాలు, ఖైనీల వంటి వాటిని వాడవద్దని పెద్దఎత్తున ప్రచారం కూడా నిర్వహించి అన్ని ప్రాంతాల్లో ప్రజలను, యువతను, విద్యార్థులను చైతన్యవంతం చేయాలి. వాటిని నమిలేస్తున్నాం అను కుంటున్నాం కానీ.. అవే మన ఆరోగ్యాల్ని నమిలేస్తున్నాయని గ్రహించాలి. ఒక్క గుట్కాలే కాదు.. పొగాకు నమిలినా, ఏ మత్తుపదార్థాన్ని వాడినా అంతే. మొదట్లో మత్తు కలిగిస్తూ, ఆ కిక్‌తో మనిషిని చిత్తు చేసేస్తాయి. ఆ తర్వాత ఆరోగ్యానికి పాడె కట్టేస్తాయి. అందుకే, వాటికి ఎంత దూరంగా ఉంటే ఆరోగ్యానికి అంత మేలు. ముఖ్యంగా విద్యార్థులు, మంచి భవిష్యత్తును కోరుకునే యువత వీటికి దూరంగా ఉండాలి. లేకుంటే ఆరోగ్యమే కాదు..జీవితాలు కూడా గుల్లే!..

- సంచారి

# నెల్లూరు ఎప్పటికి బాగుపడుతుందో?..

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

నెల్లూరు నగరాన్ని సుందరనగరంగా చేస్తామని నాయకులు అంటుంటారే కానీ, ప్రధాన రోడ్లే పరమ అధ్వాన్నంగా ఉంటు న్నాయి. దారి పొడుగూతా గతుకులు, గుంతలు. వాహనాల్లో వెళ్లేవారికి కూడా ఆ గుంటలమిట్టల రోడ్లలో ఎంతో ఇబ్బందిగా ఉంటోంది. వెంకటేశ్వరపురం వద్ద నుంచి ట్రంకురోడ్డు మీదుగా, వేదాయపాళెం దాకా ఉన్న ప్రధానమైన రోడ్డు కూడా అనేకచోట్ల కనీసం ప్యాచ్‌వర్క్‌లకు కూడా నోచుకోక ఎగుడుదిగుళ్లుగా ఉంది. ఒక్కోచోట రోడ్డు అంచులు బాగా దెబ్బతిని ఉన్నాయి. నగరంలోని మిగిలిన అనేకరోడ్ల దుస్థితి కూడా ఇదే మాదిరిగా ఉంది. అధికా రులు, నాయకులు కూడా ఈ రోడ్లమీదనే వెళ్తుంటారు కానీ, రోడ్ల దుస్థితిని పట్టించుకోవడం లేదు. దీంతో వాటి పరిస్థితి ఎక్కడ వేసిన రోడ్డు.. అక్కడనే అన్నట్లుగా తయారైంది. అనేక ప్రధానమైన కూడళ్ల ప్రాంతాల్లో ఉన్న రోడ్లు కూడా అస్తవ్యస్తంగానే ఉన్నాయి. ఈ రోడ్లు ఇంకా ఎప్పటికి బాగవుతాయో?..ఈ నెల్లూరు ఎప్పటికి బాగుపడుతుందో.. ఆ భగవంతుడికే తెలియాలి.

ఎస్.ఎల్. ఈశ్వర్, నెల్లూరు.

## తిరుమలమ్మపాళెం వంతెన.. ఇంకా ఎప్పటికి?..

వెంకటాచలం మండలంలోని తిరుమలమ్మపాళెం గ్రామానికి దగ్గరలో ఉన్న ఉప్పుకాలువపై హైలెవల్ వంతెన కట్టిస్తామని నాయకులు ఎంతోకాలంగా చెప్తూనే ఉన్నారు తప్ప ఆచరణలోకి రావడం లేదు. ఆ వంతెన ఇంకా ఎప్పటికి వస్తుందో తెలియడం లేదు. నాయకులు ఆ వంతెన సంగతి మరచిపోయారా?..వంతెన లేకుండా గ్రామంలోకి రాకపోకలు సాగించాలంటే ఎంతోకాలంగా ప్రజలకు అవస్థగా ఉంటోంది. వర్షాలు, వరదలు వచ్చినప్పుడు మరింత ఇబ్బందిగా ఉంటోంది. ఏళ్ళ తరబడిగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు, నాయకులు వంతెన కట్టించేస్తామని ఉత్తుత్తి వాగ్దానాలు చేస్తున్నారే తప్ప ఆ వంతెన ఇప్పటిదాకా కట్టింది లేదు. గ్రామస్తులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ వంతెన నిర్మాణానికి ఇకనైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు సంకల్పించాలని విజ్ఞప్తి.

ఆర్.మహేశ్వరయ్య, వెంకటాచలం.

## మార్కెట్లలో మోసాలకు అంతే ఉండడం లేదు

మార్కెట్లలో మోసాలకు అంతే ఉండడం లేదు. తూకాల్లో మోసం, సరుకులేమో నాశిరకం. కల్తీలు కూడా బాగా పెరిగిపో యాయి. ధరలు మాత్రం ఎప్పటికప్పుడు పెరిగిపోతుంటాయి. పల్లెలు పట్టణాలని లేదు. ఈ మోసాలు ప్రతిచోటా జరిగిపోతూనే ఉన్నాయి. కూరగాయల మార్కెట్లు, చేపలు-మాంసం మార్కెట్లతో పాటు అనేక దుకాణాల్లో తక్కువ తూకాలతో ప్రజలను మోసం చేస్తుండడం సర్వసాధారణమైపోయింది. తూనికలు కొలతల శాఖల అధికారులు ఎప్పుడో ఒకసారి దాడులు చేస్తుంటారు. తూకాలేసే కాటాలు సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని, దుకాణదారులకు జరిమానా వేస్తుంటారు. అయినా అనేకమంది వ్యాపారులు ఆ జరిమానాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. అధికారులు ఈ మోసాలపై, కల్తీలపై దృష్టిపెట్టి కఠినచర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు తనిఖీలు నిరంతరం జరుగుతూనే ఉండాలి. అప్పుడే కొంతవరకైనా ఇలాంటి మోసాలు తగ్గుతాయి.

- కె రాజమ్మ, కావలి.

### పూణే మెట్రో ప్రాజెక్ట్-3కు

# శ్రీసిటీలో 'అల్‌స్టోమ్' మెట్రో రైళ్లు



ప్రయాణ సాధనాల తయారీరంగంలో అగ్రగామిగా ఉన్న శ్రీసిటీలోని అల్‌స్టోమ్ ట్రాన్స్‌పోర్ట్ ఇండియా లిమిటెడ్, పూణే మెట్రో ప్రాజెక్ట్-3 కోసం మెట్రో రైళ్లను సరఫరా చేసేందుకు ఆర్డర్ పొందడం విశేషం. ఆ మేరకు ఇటీవల శ్రీసిటీలో వాటి ఉత్పత్తిని ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా పుణేలో బాలేవాడి మీదుగా, రాజీవ్‌గాంధీ ఇన్ఫోటెక్ పార్క్‌ను శివాజీనగర్‌కు కలుపుతుంది. త్వరలో అల్‌స్టోమ్ 'మేడ్ ఏ శ్రీ సిటీ' మెట్రో రైళ్ళు ఈ మార్గంలో పరుగులు తీయనున్నాయి. 23 స్టేషన్లతో కూడిన 23.3 కి.మీ ఈ కారిడార్, కొత్త మెట్రో రైల్ పాలసీ ప్రకారం భారతదేశంలో మొట్టమొదటి మెట్రో ప్రాజెక్ట్ అవుతుంది కూడా. ఆ ఘనత శ్రీసిటీకే దక్కుతుంది. ఈ ప్రాజెక్ట్ కోసం 3 పెట్టెలతో కూడిన 66 మెట్రో రైళ్లను అల్‌స్టోమ్ తయారుచేస్తోంది. ఇప్పటికే పుణేలో 1-2 ప్రాజెక్ట్ లలో భాగంగా మెట్రో రైళ్లు, ఇతర యంత్ర పరికరాలు సరఫరా చేసిన అల్‌స్టోమ్‌కు, పూణే నగరంలో ఇది 3వ ప్రాజెక్ట్ అవుతుంది. ఈ ప్రాజెక్ట్ డెవలపర్, పూణే సిటీ మెట్రో రైల్ లిమిటెడ్ (పిఐటిసిఎంఆర్ఎల్) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అలోక్ కపూర్ పూజా కార్యక్రమాన్ని నిర్వహించి, శ్రీసిటీలో మెట్రో రైళ్ల ఉత్పత్తిని ప్రారంభించారు. పూణే మెట్రోలైన్-3 ప్రాజెక్ట్ 'మేక్‌ఇన్ ఇండియా' చొరవకు ఆదర్శవంతమైన ఉదాహరణ అని, ప్రధాని నరేంద్రమోదీ 'ఆత్మనిర్భర్ భారత్' విధానాన్ని ఇది బలోపేతం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని ఆయన పేర్కొన్నారు. పిఐటిసి ఎంఆర్ఎల్ డైరెక్టర్ నేహా పండిట్, పిఐటిసిఎంఆర్ఎల్ బిజినెస్ సిస్టమ్స్ హెడ్ ఎల్.ఎన్. ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కుమార్ సైనీ, అల్‌స్టోమ్ ట్రాన్స్‌పోర్ట్ ఇండియా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూల్లో..

# ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



నెల్లూరు సరస్వతినగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూల్లో ఇటీవల విద్యార్థులు నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావు పాల్గొని ఈ ప్రదర్శనలను ప్రారంభించారు. విద్యార్థులు సుమారు 160 రకాల పోస్టర్లు.. నమూనాలను రూపొందించడం చూసి వారిని అభినందించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పధాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని, చిన్నతనం నుంచే విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి కలిగేలా చూడాలని, చిన్నారుల్లో ఆలోచనా శక్తిని ప్రోత్సహిస్తే శాస్త్రవేత్తలుగా రాణిస్తారని ఆయన చెప్పారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ఏఓ సునీల్, ప్రిన్సిపాల్ మణిమాల, ప్రపూర్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని డాక్టర్ కిషోర్స్ రత్నం థింక్ నెక్స్ట్ ఒలంపియాడ్ పాఠశాలలో కూడా నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన, విద్యార్థులు తయారుచేసిన పలు నమూనాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ కల్యాణి, మేనేజర్ రాజేష్, సిఓలు సమీర, నవ్య, సిరోజ తదితరులు పాల్గొన్నారు.

# పొట్టేపాలెం అధ్యాపకునికి..అరుదైన పురస్కారం



నెల్లూరు రూరల్ మండలం, పొట్టేపాలెం గ్రామానికి చెందిన గణిత అధ్యాపకుడు వేదగిరి వెంకటలక్ష్మీ ప్రసాద్‌కు అరుదైన పురస్కారం లభించింది. సర్ సి.వి.రామన్ అకాడమీ (సేవా) సాంస్కృతిక సంస్థ, మరియు శ్రీకృష్ణ సేవా సంస్థాన్ వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఉగాది సువర్ణ కంకణ అవార్డు'ల ప్రదానోత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఇటీవల జరిగిన కార్యక్రమంలో వెంకటలక్ష్మీప్రసాద్‌ను ఘనంగా సన్మానించి పురస్కారం అందజేశారు. శ్రీనివాస రామానుజన్ ఎక్సలెన్సీ బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ,టెలివిజన్ నటులు సాయికిరణ్ శాలువతో సత్కరించగా, శ్రీకృష్ణ సేవాసంస్థాన్ అధ్యక్షులు శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి సువర్ణ కంకణ ధారణ చేయగా, సినీ నటులు సుమన్ చేతులమీదుగా జ్ఞాపికను బహుకరించారు.

# వైసీపీకి ఓటమి భయం పట్టుకుంది

> టిడిపి నాయకులు అచ్చన్నాయుడు, సోమిరెడ్డి



వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లపైనే ఆధారపడి రాజకీయం చేయాలనుకుంటోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. ఈనెల 7న నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలసి ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ విజయమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని సూచించారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల గుణగణాలను పట్టభద్రులు, ఉపాధ్యాయులు నిశితంగా గమనించాలని, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మంచి అభ్యర్థులను శాసనమండలికి పంపాలని వారు కోరారు. టిడిపి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న కంచర్ల శ్రీకాంత్, ఎల్.సీ రమణా రెడ్డిలను ఆశీర్వదించాలన్నారు. నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల్లో జగన్ పాలన పట్ల అసంతృప్తి వెల్లువెత్తుతోందని, ఈ ప్రభుత్వ పాలనలో ఉపాధ్యాయులు ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులు చెప్ప నలవి కాదని అన్నారు. టిడిపిని ప్రజలు ఆదరిస్తున్నారని వారు చెప్పారు. ప్రజలు ఎన్నో రకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, సమస్యల పరిష్కారానికి ప్రజలు టిడిపిని గెలిపించాలని కోరారు. రాష్ట్ర శాసనసభకు ఎప్పుడు ఎన్నికలు వచ్చినా చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్‌రెడ్డి పాలన అంతా మోసమేనని విమర్శించారు. నాయకులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పార్టీ పరిశీలకులు అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# కొండబిట్రగుంట బ్రహ్మోత్సవాల్లో అపశృతి

## రథోత్సవంలో నేలవాలిన ప్రసన్నుని రథం



వైభవంగా జరుగుతున్న కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో అపశృతి చోటుచేసుకుంది. కానీ ఎవరికీ ప్రమాదం జరగలేదు. ఈనెల 7న పెద్దఎత్తున ప్రారంభమైన స్వామివారి రథోత్సవం రాత్రి 9గంటల సమయంలో పాత బిట్రగుంట నుంచి తిరిగి కొండబిట్రగుంటకు ఊరేగింపుగా వస్తుండగా, మార్గమధ్యంలో మలుపు వద్ద అదుపు తప్పి రథం నేలవాలింది. రథం కుడివైపున ఉన్న ముందు చక్రం రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దిగడంతో రథం ముందుకు పడిపోయిందని భక్తులు తెలిపారు. అయితే, ఈ ఘటనలో అర్చకులకు కానీ, భక్తులకు కానీ ఎవరికీ చిన్నపాటి గాయాలు కూడా తగల్లేదు.

# అత్యున్నతమైనది.. పార్లమెంట్ వ్యవస్థ

### - కలెక్టర్ చక్రధర్‌బాబు



దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతంచేస్తూ మనల్ని మనం పరిపాలించుకునే సుపరిపాలన, స్వపరిపాలన వ్యవస్థకు నాంది పలకడానికి పార్లమెంట్ వ్యవస్థ ఎంతో దోహదపడుతోందని, ఇదెంతో అత్యున్నతమైన వ్యవస్థ అని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈనెల 7న నెల్లూరు టౌన్‌హాల్‌లో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన మాక్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ద్వారా అమలవుతున్న చట్టాలన్నీ కూడా ప్రజలకు ఉపయోగపడే విధంగా, ప్రతి పౌరుడు దేశ అభివృద్ధిలో భాగస్వాములు అయ్యే విధంగా అమలు జరుగుతున్నాయన్నారు. ఈ వ్యవస్థలపై యువతకు సంపూర్ణంగా అవగాహన కల్పించే లక్ష్యంతో 'మాక్ యూత్ పార్లమెంట్' కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. అనంతరం విద్యార్థులచే నిర్వహించిన 'యూత్ పార్లమెంట్' ఎంతగానో ఆకట్టుకుంది. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి, ఈ కార్యక్రమం ప్రారంభించారు. జిల్లా యువజన సంక్షేమ అధికారి మహేంద్రరెడ్డి, సెట్నెల్ సిఇఓ పుల్లయ్య, కార్మికశాఖ డెప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేశ్‌కుమార్‌తో పాటు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

### గర్భిణుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లాలో మాతా శిశు మరణాలు నివారించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు వైద్యాధికారులను ఆదేశించారు. ఈనెల7న కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మాతా శిశు మరణాలపై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు సంబంధించి మెరుగైన వైద్య సేవలు అందించాలని, నిరంతరం వారి ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి అవసరమైన మందులను సకాలంలో అందజేయాలన్నారు. జిల్లా వైద్యాధికారి పెంచలయ్య, డిసిహెచ్ఎస్ రమేష్ నాథ్, ఐసిడిఎస్ పీడీ సౌజన్య, డిపిహెచ్ఎన్ఓ భూలోకమ్మ పాల్గొన్నారు.

# స్వర్ణ మహాలక్ష్మీదేవికి.. విశేష పూజలు



నెల్లూరులోని శ్రీకృష్ణ యోగమందిరం అష్టలక్ష్మి దేవాలయంలో కొలువైఉన్న స్వర్ణ మహాలక్ష్మీదేవికి ఈనెల 7న ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శ్రీ మహాలక్ష్మీదేవి జయంతి మహోత్సవం సందర్భంగా అవధూత దత్తపీఠం-నెల్లూరుశాఖ ఆధ్వర్యంలో, శ్రీ గణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞానబోధ సభ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ అజయ్‌కుమార్, ట్రస్టీలు మస్తాన్ రెడ్డి, ప్రవీణ్‌కృష్ణ, రత్నం, సురేష్, రాజశేఖర్ తదితరుల ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. తొలుత అమ్మవారి ఉత్సవమూర్తిని శోభాయమానంగా అలంకరించి అభిషేకం, లక్షకుంకుమార్చన, రుద్రహోమం, అష్టలక్ష్మీ హోమం నిర్వహించారు. రాత్రి పల్లకిసేవ ఉత్సవాన్ని వేడుకగా జరిపారు. ఈ పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# జిల్లాకు కేంద్రం అవార్డు



పునరుత్పాదక ఇంధన రంగాలకు సంబంధించి కేంద్రప్రభుత్వం నెల్లూరుజిల్లాకు అవార్డును ప్రకటించింది. నెల్లూరులో పెన్నానది ఒడ్డున నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి బ్యారేజీ, సంగం వద్ద మేకపాటి గౌతమ్‌రెడ్డి బ్యారేజీలను నిర్మించడం ద్వారా పెన్నార్ డెల్టావ్యవస్థను ఆధునీకరించడం, సాగునీటి వృధాను అరికట్టేందుకు కృషిచేయడంతో కేంద్రం ఈ అవార్డును బహుకరించింది. జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఇటీవల ఢిల్లీలో కేంద్ర విద్యుత్ నూతన పునరుత్పాదక ఇంధనశాఖ మంత్రి ఆర్‌కె సింగ్ చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

## పరిశీలకులు భాస్కర్, శశిధర్



ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకే సూక్ష్మ పరిశీలకులను కూడా నియమించడం జరిగిందని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు కాటమనేని భాస్కర్, కోన శశిధర్‌లు చెప్పారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో సూక్ష్మపరిశీలకులకు ఈనెల 6న జరిగిన శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుతో పలు అంశాలపై చర్చించారు. జేసీ కూర్మనాథ్, జిల్లా ఎస్పీ విజయారావు, డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ హరిత, అడిషనల్ ఎస్పీ హిమవతి, డిఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, నుడా వీసీ బాపిరెడ్డి, జడ్పీ సిఇఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టిగా పనిచేయండి..

# వైకాపా అభ్యర్థులను గెలిపించండి



రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులను గెలిపించాలని, అందుకు ప్రతిఒక్కరూ సమిష్టిగా కష్టపడి పనిచేయాలని, వైకాపా అభ్యర్థులను గెలిపించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామని జిల్లాలోని వైకాపా ముఖ్యనేతలు నాయకులకు పిలుపునిచ్చారు. ఈనెల 7న నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షులు..రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు. వైకాపా తరపున తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలు పోటీచేస్తున్నారని, ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, వారికి ఘనవిజయం సాధించిపెట్టాలని వారు కోరారు. భారీ మెజార్టీతో వారిని గెలిపించి ప్రతిపక్షాలకు ధీటైన సమాధానం చెప్పాలన్నారు. ఈ సందర్భంగా, ఇటీవల విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ అద్వితీయంగా జరిగిందని సంతోషం ప్రకటిస్తూ కేకు కట్‌చేసి అందరికీ పంచారు. ఆ సదస్సు విజయవంతమైన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని వారు కొనియాడారు.

# సాంఘిక సంక్షేమశాఖ..డీడీ సరెండర్

జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ రమాదేవిని విధుల్లో నిర్లక్ష్యం, ఉద్యోగుల పదోన్నతుల విషయంలో వచ్చిన పలు ఆరోపణలపై విచారించిన అనంతరం, ఆమెను ఆ శాఖకు సరెండర్‌చేస్తూ జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఇటీవల ఉత్తర్వులిచ్చారు. ఆ స్థానంలో ఇన్‌చార్జి డీడీగా బీసీ సంక్షేమం, సాధికారత అధికారి వై. వెంకటయ్యను నియమించారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి..

# వైభవంగా పుష్పయాగం



నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి దేవాలయంలో ఈనెల 6వ తేది రాత్రి అత్యంత వైభవంగా పుష్పయాగం జరిగింది. శ్రీ రాజరాజేశ్వరి దేవి సేవాసమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి - పద్మావతిలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పుష్పయాగం కోసం ప్రత్యేకంగా తీసుకువచ్చిన అనేకరకాలైన పుష్పాలతో పుష్పయాగం కనువిందుగా జరిగింది. తొలుత ఆలయ ప్రధాన అర్చకులు రఘురామమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం వేదమంత్రోచ్చారణలతో అమ్మవారిని పూజిస్తూ వైభవోపేతంగా పుష్పయాగం నిర్వహించారు. అమ్మవారి ప్రతిష్ఠ జరిగి 48 సంవత్సరాలు పూర్తికావస్తున్న సందర్భంగా పుష్పయాగం నిర్వహించినట్లు ఉభయకర్తలు తెలిపారు. నేత్రపర్వంగా జరిగిన అమ్మవారి పుష్పయాగంలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో అమ్మవారి దేవాలయం భక్తజనులతో క్రిక్కిరిసిపోయింది. ఆలయ నిర్వాహకులు పూల అలంకరణలతో, విద్యుద్దీపాలంకరణలతో దేవాలయాన్ని దేదీప్యమానం చేశారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి.. ఉత్తరభారతదేశ టిటిడి ఆలయాల సలహామండలి (న్యూఢిల్లీ) ఛైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ధర్మకర్తల మండలి ఛైర్మెన్ జయరాం, ఇఓ గిరికృష్ణ, శ్రీ రాజరాజేశ్వరిదేవి సేవాసమితి సభ్యులు పర్యవేక్షించారు.

# ఘనంగా మహిళా దినోత్సవం



ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 7న నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.దీక్షాంతి, మహిళా ఎస్‌ఐలు సయ్యద్ లతీఫున్నిసా, ప్రియాంక, ఉమెన్స్ ఫోరమ్ ఇన్‌చార్జి సునీత, ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, డైరెక్టర్ ఎవివిఎస్ ప్రసాద్‌లు పాల్గొని, విద్యార్థినులు కష్టపడి చదువుకోవాలని, విద్యలో బాగా రాణించాలని ఆకాంక్షించారు.

# 'తంగిరాల మహాభారతం' 45వ భాగం

భీమసేనుడు బకాసురుణ్ణి చంపిన తర్వాత, పాండవులు మరికొంత కాలం ఏకచక్రపురంలోనే ఆ బ్రాహ్మణుని ఇంట్లోనే ఉంటారు. ఆ ఇంటికి దేశదేశాలు పర్యటిస్తూ ఒక బ్రాహ్మణుడు అతిథిగా వస్తాడు. అప్పుడు కుంతీ అతన్ని ఎక్కడనుంచి వస్తున్నారు, ఏ మహారాజు చక్కగా పరిపాలిస్తున్నాడు అని అడిగినప్పుడు... అన్ని దేశాలకన్నా పాంచాల రాజ్యం సస్యశ్యామలంగా ఉందని, అక్కడొక వింత జరిగిందని, ఆ బ్రాహ్మణుడు వీళ్లు పాండవులని తెలీక పాంచాలరాజు, ద్రుపదునికి, ద్రోణాచార్యునికి మధ్య జరిగిన చరిత్రను చెపుతాడు. ద్రుపదుడు ద్రోణాచార్యుని మీద అక్కసుతో ద్రోణాచార్యుని యుద్ధంలో సంహరింపగల కొడుకుని, అర్జునుణ్ణి పెళ్లాడే కూతురు కావాలని




వివిధ తపోనిధులైన విప్రులను సేవించి, తన కోరిక తీరితే లక్ష గోవులు ఇస్తానని అడుగుతాడు, చివరికి యాజుడు అనే మహాతపస్వి, తన తమ్ముడు, ఉపయాజునితో ఒక యజ్ఞం చేయిస్తాడు.

ఆ అగ్ని మంటలనుంచి ధృష్టద్యుమ్నుడు, ద్రౌపది ఆవిర్భవిస్తారు. అర్జునుడు లాక్షాగృహంలో మరణించాడని, ద్రౌపదికి పెళ్లి ఎలాచెయ్యాలో దిగులుపడుతుంటే, రాజపురోహితుడు శుభ శకునాలు కనపడుతున్నాయని, పాండవులు బ్రతికే ఉన్నారని, ద్రౌపదికి స్వయంవరం చెయ్యమని సలహా ఇస్తే, ద్రుపదుడు అంగీకరించి, స్వయంవరం ప్రకటిస్తాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.






# పేర్నాటికి మద్దతుగా.. ఆర్ఎస్ఆర్ ప్రచారం



నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 7న 20వ డివిజన్ సచివాలయం పరిధిలోని స్నేహనగర్, చంద్రికానగర్, స్టీల్ ఫ్యాక్టరీ సెంటర్‌లలోని పలు అపార్ట్‌మెంట్లలో ఉన్న పట్టభద్రులకు 20వ డివిజన్ వైకాపా సీనియర్ నాయకులు, శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ రావు శ్రీనివాసరావు(ఆర్ఎస్ఆర్) ఆధ్వర్యంలో వైకాపా అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా బలపరిచిన ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించవలసిందిగా కోరుతూ ప్రచారం చేశారు. ఆ కార్యక్రమంలో 20వ డివిజన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, మహిళా నాయకురాలు సరళమ్మ, అబ్రహం, రమేష్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి,సుధాకర్, కిరణ్, నాని, ప్రతాప్, రూపేష్, శేఖర్, చిన్న, ఉదయ్, సిద్ధు, తరుణ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

# శంకరమఠంలో చండీహోమం



ఈనెల 7న ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా నెల్లూరు మూలాపేటలోని శంకర మఠంలో చండీహోమాన్ని వైభవంగా నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. జనార్దన్ దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. శంకరమఠం నిర్వాహకులు నందకిషోర్, ఉషాకుమారి దంపతులు ఈ వేడుకలను పర్యవేక్షించారు.



## 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'లో బీఎంఆర్

ఇటీవల విశాఖపట్నంలో రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023 కార్యక్రమంలో మన నెల్లూరీయుడు, రాజ్యసభ సభ్యులు, ప్రముఖ వ్యాపారవేత్త బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) పాల్గొన్నారు. 974 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతంలో పోర్టులు, హార్బర్లు ఏర్పాటు చేయడం ద్వారా ఆ ప్రాంతాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని, దీని ద్వారా ఎగుమతులు, దిగుమతులు కూడా సులభతరం అవుతాయని, అనేకమంది ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టేందుకు వీలుకలుగుతుందని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక్క ఫోన్‌కాల్‌తో పెట్టుబడిదారుల పనులు సులభతరం చేసే విధంగా చర్యలు కూడా చేపట్టడం హర్షదాయకమని, ఇటువంటి మంచి ఆలోచనలతో ముందుకెళ్తున్న మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అభినందనీయులని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మరియు వాటర్ వేస్ శాఖల మంత్రిని బీఎంఆర్ మర్యాదపూర్వకంగా కలిసి సముద్ర తీర ప్రాంతాల అభివృద్ధికి చేస్తున్న కృషిపై చర్చించారు.

# జిల్లాలో అన్నిస్థానాలు గెలుస్తాం

➢ నెల్లూరు ఎంపీ ఆదాల ధీమా

నెల్లూరు జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మార్చి 6న బుచ్చిలో ఆ పార్టీ కార్యాలయ భవనాన్ని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ వైఎస్ హయాంలో 11కు 11 అసెంబ్లీ స్థానాలు గెలిచామని, జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కూడా అన్ని స్థానాల్లో విజయం సాధించామని, రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ అదే ఫలితాలను పొందబోతున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ చాలా మంచిస్థితిలో ఉందని పేర్కొన్నారు. అయినా, ఎల్లో మీడియా ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. విశాఖ పారిశ్రామిక సదస్సులో, నెల్లూరు జిల్లాకు కూడా 4 పరిశ్రమలు రాబోతున్నాయని తెలిపారు. రామాయపట్నం పోర్టు పనులు వేగంగా జరుగుతున్నాయని, తద్వారా జిల్లాకు మేలు జరగనుందని చెప్పారు. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిరంతరం పర్యటించి అద్భుత ఫలితాలు రాబట్టారని, ఆ కార్యక్రమంలో మంచి ఫలితాల సాధనలో బహుశా రాష్ట్రంలో ఆయనే ప్రథముడు కావచ్చునని ప్రశంసించారు. పార్టీ కార్యాలయానికి సొంత స్థలాన్ని విరాళంగా ఇచ్చిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుప్రజ, ఆమె భర్త మురళిలను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. అంతకుముందు అతిథులకు ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, ఆప్కాబ్ ఛైర్మెన్ కొండూరు అనిల్‌బాబు, బుచ్చి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లారెడ్డి, సతీష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సుప్రజ, మురళి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్ని ఆటుపోట్లు వచ్చినా సంక్షేమం ఆగలేదు

రాష్ట్రంలో ఎన్ని ఆటుపోట్లు వచ్చినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో రాష్ట్ర ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు ఎప్పుడూ ఆగలేదని ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. 17, 18, 19 డివిజన్ల రథసారథులు కార్పొరేటర్ సుధాకర్, సమన్వయకర్తలు పచ్చ రవి, నారాయణ, వంశీ తదితరుల ఆధ్వర్యంలో ఇటీవల నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదాల మాట్లాడారు. కోవిడ్‌తో పాటు రాష్ట్రానికి ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సీఎం జగన్ వెనుకంజ వేయలేదని వివరించారు. గత 25 ఏళ్లుగా తాను రాజకీయాల్లో ఉన్నానని, అధికార పార్టీలో ఉండడం వల్ల ప్రజలకు మంచి కార్యక్రమాలు చేసే అవకాశం కలిగిందని అన్నారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ అశోక్‌నాయుడు అధ్యక్షత వహించారు. కొండ్రెడ్డి రంగారెడ్డి, బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, మొయిళ్ళ గౌరీ, సత్తార్, శ్రీనివాసులురెడ్డి, ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం ఛైర్మెన్ ఆర్ఎస్ఆర్ తదితరులు పాల్గొన్నారు.

### పెట్టుబడిదారుల సదస్సు..

# సిఎం జగన్ అద్భుత విజయం

## కొనియాడిన శ్రీసిటీ ఎం.డి డా.రవీంద్ర సన్నారెడ్డి



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డైనమిక్ నాయకత్వం పెట్టుబడిదారులపై పెద్దఎత్తున ప్రభావం చూపిందని, ఇటీవల విశాఖలో ఏర్పాటైన పెట్టుబడిదారుల సదస్సు అద్భుత విజయం సాధించిందని శ్రీసిటీ ఎం.డి డా.రవీంద్ర సన్నారెడ్డి కొనియాడారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చొరవతో ఈ కార్యక్రమం దిగ్విజయమైందని, ఈ చొరవ ఆంధ్రప్రదేశ్‌ను లాజిస్టిక్స్ హబ్‌గా, ఆగ్నేయాసియాకు గేట్‌వేగా మారుస్తుందనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన కార్యక్రమాలు, చురుకైన విధానాలు, ప్రధాన నౌకాశ్రయాలతో కూడిన సుదీర్ఘ తీరప్రాంతం, అద్భుతమైన రోడ్డు, రైలు నెట్‌వర్క్‌లు, నాణ్యమైన శక్తి, సాంకేతికంగా నైపుణ్యం కలిగిన మానవశక్తి, గొప్ప ఖనిజ వనరులు మరియు ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ బిజినెస్ పార్కులతో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంటూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఆహ్వానిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన శ్రీసిటీ స్టాల్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్, శ్రీసిటీ ఎం.డి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఇతర ప్రముఖుల సమక్షంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించడం విశేషం. స్టాల్‌ను తిలకించిన ఆ ప్రముఖులంతా శ్రీసిటీ విశిష్టతను ప్రశంసించారు. ఇందులో డిజిటల్ డిస్‌ప్లే బోర్డ్‌లు, శ్రీసిటీ వ్యాపార నగరం ప్రత్యేకతలు, ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలు, ఇతర అంశాలను హైలైట్ చేశారు. శ్రీసిటీలోని కొన్ని పరిశ్రమలచే ప్రదర్శించబడిన వివిధ బ్రాండ్‌ల ఎయిర్ కండిషనర్లు, ఆటోమొబైల్ కాంపోనెంట్‌లు, వీల్ చైర్లు, ఇసుజు కార్లు తదితర 'మేడ్ ఏ శ్రీసిటీ ఉత్పత్తులు' ఈ సదస్సుకు వచ్చిన ప్రతినిధులను విశేషంగా ఆకర్షించాయి.

### శ్రీసిటీ స్టాల్‌ను సందర్శించిన..
### ఆర్థిక మంత్రి బుగ్గన

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విశాఖలోని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్–2023లో శ్రీసిటీ స్టాల్‌ను సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రత్యేకతలు, వివిధ రంగాల్లోని పరిశ్రమలు, వాటి ఉత్పత్తులు తదితర అంశాలను వివరించారు.




## శ్రీసిటీకి రూ. 7,075 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు

విశాఖపట్నంలో జరిగిన రెండు రోజుల గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్–2023లో, శ్రీసిటీకి సంబంధించి రూ. 7,075 కోట్లు విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు, వర్చువల్ ప్రారంభోత్సవాలు జరిగాయి. ఇందులో ఇప్పటికే ఉన్న 14 పరిశ్రమల ప్లాంట్ విస్తరణ కాగా, 5 కొత్త పరిశ్రమల ప్రతిపాదనలు ఉన్నాయి. వీటివల్ల దాదాపు 17,500 మందికి ఉద్యోగ అవకాశాలు కూడా రానున్నాయి. విశాఖ పెట్టుబడుల సదస్సు వేదిక నుంచి కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖా మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 14 పరిశ్రమలను వర్చువల్‌గా ప్రారంభించగా, అందులో శ్రీసిటీకి చెందిన 7 పరిశ్రమలు ఉండడం విశేషం. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఇతర ప్రముఖులు ఆ పెట్టుబడుల ఒప్పంద పత్రాల మార్పిడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంవోయూలపై డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్పందిస్తూ, చురుకైన విధానాలతో రాష్ట్రంలో బలమైన పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో శ్రీసిటీ అత్యంత ప్రాధాన్య పెట్టుబడి గమ్యస్థానాలలో ఒకటిగా ఆవిర్భవించిందన్నారు.

# వైకాపా అభ్యర్థులను గెలిపించండి

## కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న



రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి చెందిన అభ్యర్థులకు అఖండ విజయం చేకూర్చిపెట్టాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కోవూరు మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థిగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి అభ్యర్థిగా పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు.



# అన్ని స్థానాల్లో విజయమే లక్ష్యంగా కృషిచేయాలి

## పార్టీ శ్రేణులకు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపు



రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో 175కి 175 స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌బోర్డు ఛైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈనెల 5న ఆయన రాపూరు మండలంలోని వేపినాపి గ్రామంలో మాజీ ఏఎంసి ఛైర్మన్ పాపకన్ను మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాపూరు మండలంలోని వైకాపా కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఒక సైనికునిలా పనిచేయాలన్నారు. గ్రామస్థాయిలో వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నిరంతరం కృషిచేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కూడా విజయం సాధించి మళ్ళీ సిఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చూడాలన్నదే తమ ధ్యేయమన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, రాష్ట్ర నృత్య అకాడమీ ఛైర్ పర్సన్ శిరీష, పాపకన్ను సోదరులతో పాటు నాయకులు బత్తిన పట్టాభిరామిరెడ్డి, నెల్లూరు రవీంద్రరెడ్డి, దందోలు లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో కొలువైవున్న గ్రామదేవత శ్రీ పోతుకొండ అంకాళ పరమేశ్వరి అమ్మవారి దేవాలయాన్ని సందర్శించి పూజలు చేశారు.

### పెంచలకోనలో పూజలు



ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని ఈనెల 5న రామ్‌కుమార్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వామివార్లకు పూలమాలికలను తలపై మోసుకుని తెచ్చి సమర్పించారు. రామ్‌ను ఆలయ అధికారులు ఆలయమర్యాదలతో స్వాగతించి శ్రీ లక్ష్మీనరసింహస్వామికి, ఆదిలక్ష్మి అమ్మవారికి, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేయించారు.

# శ్రీసిటీ వితరణగా 'విజయ సాధన' పుస్తకాలు



శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా ఇటీవల శ్రీసిటీ పరిసరాల్లోని మాదనపాలెం, ఇరుగుళం జడ్పీ హైస్కూళ్ల పదవ తరగతి విద్యార్థులకు 'విజయ సాధన' పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లా విద్యా శాఖకు చెందిన డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా పదవ తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షల సన్నద్ధతకు ఉపయోగపడే ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా కొనుగోలు చేసి విద్యార్థులకు అందచేసినట్లు ఫౌండేషన్ ప్రతినిధి సురేంద్రకుమార్ తెలిపారు.

### విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

52వ జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని శ్రీసిటీ ఫౌండేషన్, సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల శ్రీసిటీ పరిధిలోని మాదనపాలెం, ఇరుగుళం జడ్పీ హైస్కూళ్లు, చిన్మయా విద్యాలయ, అకార్డ్ స్కూల్‌కు చెందిన 6,7,8, 9వ తరగతుల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

### జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు సంబరాలు



పారిశ్రామిక కార్మికుల భద్రత ఆవశ్యకతను గుర్తిస్తూ, శ్రీసిటీలో ఇటీవల 52వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు ఉత్సవాలను జరుపుకున్నారు. ఇందులో శ్రీసిటీ ఉద్యోగులు, పరిశ్రమల సిబ్బందితో పాటు సమీప పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ట్రేడ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (ప్రాజెక్ట్స్) శేఖర్ భద్రతా జెండాను ఎగురవేసి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. శ్రీసిటీ సేఫ్టీ మేనేజర్ కె.నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# వైకాపా అభ్యర్థులను ఆదరించండి



గూడూరులోని గమ్మళ్ళపాలెంలో సచివాలయ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నం మురళిగౌడ్ ఆధ్వర్యంలో ఇటీవల ఎమ్మెల్సీ పట్టభద్రుల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్ ఓటర్లను పలకరిస్తూ, వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీసీ సెల్ కార్యదర్శి బట్టా గోపియాదవ్, కో-ఆర్డినేటర్ రాఘవరెడ్డి, దగ్గోలు సురేంద్రబాబు, గుత్తల మణియాదవ్, గుణకల దామోదర్, టిజే. మార్క్, పర్వతాల భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

### ముస్లిం పిల్లల చదువుకు...

# మహమ్మదీయ వెల్ఫేర్ నెట్‌వర్క్ అండ

**- గౌరవాధ్యక్షుడు రియాజ్ అహ్మద్**



గూడూరులో ముస్లిం పిల్లలను చదువులో ప్రోత్సహించడానికి మహమ్మదీయ వెల్ఫేర్ నెట్‌వర్క్ స్థాపించడం జరిగిందని, ముఖ్యంగా ఆడపిల్లలు చదువుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ వారికి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు నెట్‌వర్క్ గౌరవాధ్యక్షులు రియాజ్ అహ్మద్ తెలిపారు. అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ ఎస్‌కెఆర్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని షేక్ ఆరిఫా అభ్యర్థన మేరకు ఈ నెల 7న ట్యాబ్‌ను అందించామని తెలిపారు. నెట్‌వర్క్ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ కాలేషా మాట్లాడుతూ ఆడపిల్ల చదువుతోనే ఆ కుటుంబాల శ్రేయస్సు ఆధారపడి ఉంటుందన్నారు. నెట్‌వర్క్ సలహాదారులు రహీం, సభ్యులు రావూఫ్, జిలాని, భాష, బాబు తదితరులు పాల్గొన్నారు.



# లయన్స్ క్లబ్ మహిళా దినోత్సవం

గూడూరు పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు సాయి, రామ్ మోహన్ మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సరస్వతి శిశుమందిర్‌కి కుర్చీలు, ఫ్యాన్లు అందించడం జరిగిందన్నారు. రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా ఇద్దరు మహిళలకు లయన్స్ క్లబ్ ద్వారా కుట్టుమిషన్లను అందించడం సంతోషంగా ఉందని, దాదాపు 40 మంది నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేయడంలో సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ సైంటిస్ట్ శ్రీహరికోట శోభన్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగజ్యోతి దంపతులను శాలువాలతో సత్కరించి ఆశీర్వదించారు. సరస్వతి శిశుమందిర్ నిర్వాహకురాలు శోభారాణిని ఘనంగా సత్కరించారు. దాతలు బ్రహ్మదేవి శీనయ్య, రాధాకృష్ణ, నాగజ్యోతి, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ వాకాటి రామ్మోహన్‌రావు, అధ్యక్షులు కళ్యాణ సాయి తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులకు 'ప్రగతి' క్రీడా పోటీలు



గూడూరు, ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సుమారు 60 మంది మహిళా డాక్టర్లకు, నర్సులకు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని మూడు విభాగాలుగా విభజించి పి.డి కరిముల్లా ఆధ్వర్యంలో రన్నింగ్, బాల్‌త్రో, లెమన్ & స్పూన్, టగ్‌ఆఫ్ వార్ అంశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ పి.విజయని హాస్పిటల్ సూపరింటెండెంట్ రామకృష్ణ సన్మానించారు. అనంతరం పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రగతి సేవాసంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ శ్రీనివాసులు, వాకాటి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

# నాగేశ్వరస్వామికి నాగాభరణం



తిరుపతి జిల్లా గూడూరు రూరల్ మండలంలోని మిత్రాత్మకూరు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ఉమా పార్వతి సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 7న ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పంట నాగిరెడ్డి శ్రీదేవమ్మ దంపతులు స్వామివారికి వెండి నాగాభరణం, ధారాపాత్రను బహూకరించారు. నాగాభరణానికి సంప్రోక్షణ చేసి దేవాలయంలో ఉంచారు. ఈ సందర్భంగా ఏకాదశి రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం హోమాలను నిర్వహించారు. అర్చకులు ములుగు శ్రీరామ వరప్రసాద్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# మహిళ లేనిదే.. ప్రపంచం లేదు

**- విఎస్ఆర్ పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణరాజు**



గూడూరు రెండవ పట్టణ పరిధిలోని విఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఈ నెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు రంగాల్లో పనిచేస్తున్న మహిళామూర్తులను సన్మానించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణ రాజు మాట్లాడుతూ మహిళ లేనిదే ప్రపంచం లేదని, మహిళ పుట్టుకతోనే ప్రపంచంలోనే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ అన్నపూర్ణ, ప్రధానోపాధ్యాయులు శాంతకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మీ జయంతి

గూడూరులోని అళఘనాథస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 7వ తేదీ శ్రీ లక్ష్మీ జయంతి, కుంకుమపూజ, పల్లకీసేవలు వైభవంగా జరిగాయి. 12వతేదీ వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాలకి భక్తులు విచ్చేసి శ్రీస్వామి అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని దేవస్థాన కమిటీ కోరుతోంది.

# గోరంతలు కొండంతలు చేస్తున్న.. సామాజిక మాధ్యమాలు

## పదవిని 'తిరస్కరించారంటూ'.. చాగంటిపై ప్రచారాలు



**విలువలు పలువలు వేయడమంటే ఏంటో, గోరంతలు కొండంతలు చేయడం ఎలాగో తెలుసుకోవాలంటే నేటి సామాజిక మాధ్యమాలను చూస్తే చాలు. ఒక్కోసారి లేనిది ఉన్నట్లుగా, ఉన్నది లేనట్లుగా కూడా చూపడం, అర్థాలకు పెడార్థాలు తీయడం, వాటినే పదేపదే చూపించడం నేడు అనేక సామాజిక మాధ్యమాలకు అలవాటైపోయింది. 'సెన్సేషన్' కోసం ఆరాటపడడంలో తప్పులేదు కానీ, కనీసం సెన్స్ కూడా లేకుండా కావాలనే లేనిపోని ఊకదంపుడు ప్రచారాలు చేయడం, గౌరవనీయ వ్యక్తులనే సామాజిక స్పృహ లేకుండా ఎవరెంతటివారైనా సరే మాకేం అన్నట్లుగా అవాకులు చెవాకులు మాట్లాడడం మామూలైపోయింది.**

అందుకు తాజా ఉదాహరణగా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు, నిరంతరం కలియుగ ప్రత్యక్షదైవమైన ఆ శ్రీ వేంకటేశ్వరస్వామి ధ్యాసలో ఉండేవారు, కోట్లాదిమంది భక్తులకు ఆధ్యాత్మిక గురువుగా మంచిగుర్తింపు పొందిన చాగంటి కోటేశ్వరరావు వంటివారు కూడా అలాంటి ప్రచారాలకు గురికావడం భక్తులకొనికి ఆవేదన కలిగిస్తోంది. ఇంతకీ అసలు విషయం ఏమిటంటే..చాగంటివారికి టిటిడి వారు ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మప్రచార పరిషత్‌కు గౌరవ సలహాదారుగా పదవిని ఇస్తున్నట్లు ప్రకటించారు. అందుకు చాగంటివారు టిటిడి ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, భగవంతుని సేవకు తానెప్పుడూ సిద్ధమని, అయితే అందుకు తనకు పదవెందుకని అన్నారు. అంతేకాదు, 'శ్రీ వేంకటేశ్వరుడు..అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు. ఆయన నా ఊపిరి. 'పడి బాయక తిరిగే ప్రాణ బంధుడా'.. అన్నాడు అన్నమయ్య. ఆ భగవంతుని సేవలకు నేనేమైనా పనికొస్తే నా జీవితానికి అంతకంటే ధన్యత ఏం కావాలి?..అని కూడా చెప్పారు. ఇంకా వివరంగా..'పదవి ఇస్తేనే పనిచేస్తానని ఎందుకనుకుంటారు?..నాకు ఏ పదవీ వద్దు..టిటిడి వారు ఆ భగవంతుని కోసం ఏ పనిచేయమన్నా పరుగుపరుగున వెళ్ళి చేస్తా'..అని చాగంటి వారు ఎంతో వినమ్రంగా చెప్పారు.

ఇక్కడ సామాజిక మాధ్యమాల వారికో పాయింట్ దొరికింది. ఆ విషయాన్ని ప్రసారం చేయాలనుకున్న కొన్ని చానల్స్‌వారు, చాగంటి వారు పదవి వద్దన్నారు కదా అని, ఆయన ఆ 'పదవిని తిరస్కరించారంటూ' ఛానల్స్‌లో ఊదరగొట్టేశారు. ఆ చెప్పడం కూడా 'తిరస్కరించారు' అంటూ ఘాటుగా చెప్పారు. అందుకు చాగంటి వారెంతో నొచ్చుకున్నారు. 'అయ్యో!..నేనేమీ తిరస్కరించలేదే. అసలు 'తిరస్కరించడం'..అంటే అర్థం ఏంటి?..నేనాపని చెయ్యనే చెయ్యనని అన్నానా?.. అంటూ బాధపడ్డారు. తిరస్కరించడానికి..దాన్నొక రూపంలో ఆమోదించడానికి తేడా ఉంది కదా!'..అని ఆయన ఆవేదనగా ఆ తర్వాత వివరణ కూడా ఇచ్చుకోవాల్సి వచ్చింది. 'టిటిడి వారికి ఎప్పుడు ఏ సహకారం కావాలన్నా అందిస్తాను. అది నాకు అదృష్టంగా భావిస్తాను. అందుకు పదవి అక్కర్లేదని చెప్పానేతప్ప, 'అది తిరస్కారం కాదు. మరో రూపంలో ఆమోదించడమే' నని కూడా స్పష్టం చేశారు. దాంతో ఆ విషయం ఎట్లనో సద్దుమణిగింది.

అయినా..పదవుల కోసం పరుగులు తీసేవారు, పదవుల కోసమే బతికేవారు, పదవుల కోసం ఎంతకైనా దిగజారేవారు నేటి సమాజంలో కోకొల్లలుగానే ఉంటారు. అయితే, అందరూ అలాకాదు. ముఖ్యంగా భగవంతుని నమ్ముకుని ఉండే వారికి అవన్నీ తృణప్రాయమే. వారికి పదవులకన్నా.. భగవంతుని సేవే మిన్న. అలాంటివారు పదవులు కావాలని పాకులాడితే సంచలనం కానీ, ఏ పదవులూ వద్దు దేవుడా!..నీ సేవే చాలు'..అనుకునే చాగంటి వారిలాంటి మహనీయులపై కూడా లేనిపోని 'తిరస్కార ప్రచారాలు' ఎంతవరకు సబబు?..అని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

## 19న 'పెరసం' ఉగాది కవిసమ్మేళనం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 19వ తేది ఆదివారం ఉదయం 9.30 గంటలకు నెల్లూరు ఆసుపత్రిలోని సమావేశ మందిరంలో ఉగాది కవిసమ్మేళనం నిర్వహించనున్నామని 'పెరసం' (పెన్నా రచయితల సంఘం) నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులకు జ్ఞాపికలు బహుకరిస్తామని తెలిపారు. అనంతరం కవయిత్రి తోట సులోచన సౌజన్యంతో ఆమె తల్లి తండ్రులు తోట చెంచులక్ష్మమ్మ-గురుమూర్తిల స్మారకంగా పలువురు కవులు కవయిత్రులకు సన్మానం ఉంటుందని, డా.పెళ్ళూరు సునీల్, డా. సుంకర గోపాల్, పల్లావు రాము, గీత, ఎస్.గాయత్రిలకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేయనున్నామని పేర్కొన్నారు.

## సద్బుద్ధితో మెలగండి

### రౌడీషీటర్లకు సంతపేట ఇన్స్‌పెక్టర్ కౌన్సిలింగ్

రౌడీయిజం మాని సద్బుద్ధితో మెలగాలని, పాత అలవాట్లకు స్వస్తి చెప్పి మంచిమార్గంలో నడవాలని నెల్లూరులోని సంతపేట పోలీస్ ఇన్స్‌పెక్టర్ అన్వర్‌బాషా రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇటీవల ఆయన రౌడీషీటర్లను పిలిపించి, వారు ఇప్పుడు ఎక్కడెక్కడ ఏం పనులు చేస్తున్నారో ఆ వివరాలన్నీ సేకరించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రవర్తన మార్చుకుని సన్మార్గంలో నడిస్తే రౌడీషీట్లు తొలగించేందుకు సహకరిస్తామని, లేదంటే జైళ్లలో మగ్గక తప్పదని చెప్పారు.

## వాల్మీకి బోయలను.. ఎస్టీలుగా పరిగణించాలి

రాష్ట్రంలోని వాల్మీకి బోయలను ఎస్టీలుగా పరిగణించాలని వాల్మీకి సంఘం ప్రతినిధులు ఈశ్వరయ్య, నరసింహులు ఇటీవల నెల్లూరుకు వచ్చిన కేంద్ర సమాచార మంత్రి మురుగన్‌కు వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీలు, మైదాన ప్రాంతాలు అనే తేడా లేకుండా వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించాలని, ఈ అంశం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని, ఆ సమస్య పరిష్కారానికి కేంద్రమంత్రి చొరవచూపాలని వారు విన్నవించారు.

## పొదుపు మహిళల కోసం..సబ్సిడీ రుణాలు

జిల్లాలోని పొదుపు సంఘాల్లో ఉన్నవారికిదో శుభవార్త. వారి జీవనోపాధికి ప్రధానమంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమ క్రమబద్ధీకరణ పథకం (పిఎం ఎఫ్ఎంఇ) కింద పొదుపు మహిళలకు లక్ష నుంచి రెండు లక్షల రూపాయల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించేందుకు సహకరిస్తామని డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు కలెక్టరేట్‌లోని డిఆర్‌డిఏ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, మహిళలకు చిప్స్ తయారీ, పాప్‌కార్న్, జ్యూస్‌ల తయారీ యంత్రాలు, ఇడ్లీపిండి తయారుచేసేందుకు గ్రైండర్లు కొనుగోలు చేసేందుకు ఈ రుణాలను 35శాతం ప్రభుత్వ సబ్సిడీతో అందిస్తామన్నారు. సబ్సిడీ పోను మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులు బ్యాంక్‌లకు తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెలాఖరు నాటికి కనీసం వెయ్యిమంది మహిళలకు ఈ రుణాలు అందించాలని సంకల్పించామన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో 11, 15వ తేదీల్లో జాతీయ సదస్సులు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఈనెల 11, 15 తేదీల్లో విద్యార్థులకు జాతీయ సదస్సులు నిర్వహించనున్నారు. దేశంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు ఈ సదస్సుల్లో పాల్గొని తమ పరిశోధనలను ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 11న ట్రిబుల్-ఇ విభాగం ఆధ్వర్యంలో ఇన్ఫిరాన్-2023 జాతీయ సాంకేతిక సదస్సు జరుగుతుందని, కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి, విభాగాధిపతి డా.ఎస్ సురేష్‌రెడ్డి తెలిపారు. ఇటీవల అందుకు సంబంధించిన గోడ పత్రికలను వారు ఆవిష్కరించారు. దేశంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ సదస్సులో తమ పరిశోధనలను ఆవిష్కరిస్తారని కార్యక్రమ కన్వీనర్ డా.ఐ ప్రభాకర్‌రెడ్డి, విద్యార్థి కోఆర్డినేటర్లు ఏ.గురుసాయి, కె.యశ్వంత్, పి.చెశ్విత, పి.వెంకటసాయి, డి.సాయికుమార్ పేర్కొన్నారు. అదేవిధంగా, ఈనెల 15న సిఎస్ఇ విభాగం ఆధ్వర్యంలో టెక్‌వ్యూహ-2023 జాతీయ సదస్సు నిర్వహించనున్నామని వారు తెలిపారు. ఇటీవల కళాశాల ప్రాంగణంలో సదస్సుకు సంబంధించిన గోడపత్రికలు ఆవిష్కరించారు. కళాశాల డైరెక్టర్‌తో పాటు విభాగాధిపతి డా. ఏ.రాజశేఖర్‌రెడ్డి, ప్రోగ్రామ్ కన్వీనర్ సిహెచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, విద్యార్థి కోఆర్డినేటర్లు పి.జశ్వంత్, టివి సాయిస్మరణ్, జి.లక్ష్మీప్రియ, ఎస్. తేజస్విని, కె.హేమతేజశ్రీ, ఎం. సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### నెల్లూరు స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని, స్కానింగ్ సెంటర్ల వారు ఆ పరీక్షలు చేయకూడదని ఉన్నతాధికారులు ఆదేశించి వున్న నేపథ్యంలో నెల్లూరు నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లను వైద్య ఆరోగ్యశాఖ డెమో అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో తనిఖీలుచేపట్టారు. రికార్డులు తనిఖీచేసి, నిర్వాహకులకు ఆమేరకు హెచ్చరికలు చేశారు. హెచ్ఇ నరసింహారావు పాల్గొన్నారు.

### బుచ్చిలో ప్లాస్టిక్ కవర్లు వాడొద్దంటూ అవగాహన

బుచ్చి నగర పంచాయతీ పరిధిలో ప్రజలు ప్లాస్టిక్ కవర్లు వాడొద్దంటూ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇటీవల అవగాహన కలిగించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడంటే అక్కడ వేయకూడదని, 'స్వచ్ఛ బుచ్చిరెడ్డిపాళెం'కు ప్రజలు సహకరించాలని, తడి - పొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని కోరారు.

### ముత్తుకూరు.. చెరువులో ఈత నిషేధం

చెరువులు, నదుల్లో ఈతకు దిగి తరచూ ప్రాణాలు కోల్పోతున్న సంఘటనల నేపథ్యంలో ముత్తుకూరు చెరువులో ఈతకు దిగడం నిషేధమని పోలీసులు చెరువు వద్ద ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటుచేశారు. చెరువులో ప్రమాదకరమైన సుడిగుండాలున్నాయని, ఎవరూ దిగవద్దని, దుస్తులు ఉతకడానికి కూడా చెరువులో దిగవద్దని పోలీసులు హెచ్చరించారు.

### గుడవల్లూరులో ఉచిత వైద్యశిబిరం

కొండాపురం మండలంలోని గుడవల్లూరు గ్రామంలో ఎలెన్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వారు ఇటీవల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ బద్దిపూడి మాచర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ అభినయ రోగులను పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఎంతోమంది పేద రోగులు ఈ శిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకున్నారు.

### గుడ్లూరులో పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రమైన గుడ్లూరులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంట తహశీల్దార్ సూర్యనారాయణ, ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కావలి విద్యార్థికి.. జెఎన్‌టియు క్రీడల్లో బహుమతి

కావలిలోని విట్స్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న జి.ప్రవీణ్ ఇటీవల జరిగిన జెఎన్‌టియు క్రీడల్లో షటిల్ బ్యాడ్మింటన్‌లో పాల్గొని ద్వితీయ బహుమతి సాధించాడు. దీంతో ఆ విద్యార్థిని ఈనెల 7న కళాశాల ఛైర్మెన్ దొడ్ల విద్యాధర్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దత్తాత్రేయశర్మ, ఫిజికల్ డైరెక్టర్లు భాస్కర్‌రావు, ఏడుకొండలు తదితరులు అభినందించారు.

### మనుబోలులో..పశువైద్యశాల తనిఖీ

జిల్లా పశువైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు ఈనెల 7న మండల కేంద్రమైన మనుబోలులో ఉన్న ప్రాంతీయ పశువైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంబంధిత అధికారులు, సిబ్బందికి తగు సూచనలిచ్చారు. పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఈనెల 31వ తేది వరకు ఉచితంగా టీకాలు వేయాలని చెప్పారు.

### నార్త్‌రాజుపాలెంలో..పొలం బడి

కొడవలూరు మండలంలోని నార్త్‌రాజుపాళెం గ్రామంలో ఈనెల 7న సహాయ వ్యవసాయ సంచాలకులు మారుతిదేవి ఆధ్వర్యంలో 'మైవిస్టార్ పొలంబడి' కార్యక్రమాన్ని నిర్వహించారు. మిత్రపురుగుల ప్రాముఖ్యతను, సేద్యంలో పలు ముఖ్యమైన అంశాలను రైతులకు వివరించారు. కోవూరు ఏడిఏ సుజాత, వ్యవసాయ అధికారి శిరీష, మధురిమ, ఏఈ లక్ష్మి పాల్గొన్నారు.

# గ్లోబల్ సమ్మిట్‌తో సమాధానం

(మొదటి పేజీ తరువాయి)

ఉండి, ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ సదస్సు నిర్వహించడం ఓవైపు మేధావులని ఆలోచింప చేస్తున్నా, 'బెటర్ లేట్.. దెన్ నెవెర్' అన్నట్లుగా ఇప్పటికైనా పరిశ్రమలు, పెట్టుబడులపైన శ్రద్ధ పెట్టినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నభూతో న భవిష్యత్‌లా...

విశాఖలో జరిగిన "గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్" (ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు) నభూతో న భవిష్యత్ అని చెప్పొచ్చు. అనాధగా మిగిలిపోయిందనుకున్న ఆంధ్రరాష్ట్రానికి ఎట్టకేలకు మంచిరోజులు వచ్చాయనిపిస్తోంది. దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలతో పాటు ప్రపంచవ్యాప్తంగా 25 దేశాల నుంచి కూడా 46 మంది రాయబారులు వచ్చి ఈ సమావేశాల్లో పాల్గొనడం విశేషం. దేశవిదేశాల ప్రముఖ పారిశ్రామికవేత్తలందరూ ఒక వేదికమీదికి రావడం, ఆంధ్రకు అండగా నిలుస్తామని చెప్పడం, లక్షల కోట్లు పెట్టుబడులుగా పెట్టి ఆంధ్రను అన్నివిధాలుగా ప్రగతి పథంలో పయనింపజేస్తామని హామీ ఇవ్వడం రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త ఊపిరులను ఇచ్చింది!.. విభజన కష్టాలతో, ఆ పై వచ్చిన పెను నష్టాలతో దిగాలుపడి ఉన్న ఆంధ్రకు ఇదొక ఊరట. ఈ సదస్సు దిగ్విజయం కావడంతో.. లక్షల కోట్ల పెట్టుబడులతో ఇక ఆంధ్రకు తిరుగులేదన్న ఆశాభావన పారిశ్రామిక, వ్యాపార వర్గాల నుండి వ్యక్తమవుతోంది.

వ్యాపార రంగంలో మహామహులనబడే అంబానీ, ఆదాని వంటి దిగ్గజాలతో పాటు జిందాల్, ఒబెరాయ్, భజాంకా, దాల్మియా, మిట్టల్, జీఎం రావు, కృష్ణ ఎల్లా, అపోలా ప్రీతారెడ్డి, సతీష్‌రెడ్డి, బివిఆర్ మోహన్‌రెడ్డి, మసహిరో యమాగుచి, టెస్లా కో-ఫౌండర్ మార్టిన్ ఎబర్‌హర్ట్ వంటి 30కి పైగా కార్పొరేట్‌రంగాల ప్రసిద్ధులంతా వచ్చి, ఆంధ్రలో పెట్టుబడులు పెట్టి, పరిశ్రమలు స్థాపించడానికి సుముఖత చూపారు. బ్లూస్టార్, క్లింబెర్లీ క్లార్క్, అంబర్, హావెల్స్, ఎక్సలెంట్ ఫార్మా, ఎన్‌జిసి ట్రాన్స్‌మిషన్స్, చార్ట్ ఇండస్ట్రీస్, లారస్ ల్యాబ్, అమరా లైఫ్, శారద ఫెర్రో అల్లాయిస్, విన్‌విన్ స్పెషాలిటీ, ఏఓవి ఆగ్రో ఫుడ్స్, ఎస్‌హెచ్ ఫుడ్, అవేరా, అపాజీ, హెటిరో వంటి పెద్దపెద్ద సంస్థలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. కేంద్ర మంత్రులు, రాష్ట్రమంత్రులు, శ్రీసిటీ తదితర పారిశ్రామికాధినేతలు ఎందరో ఈ సదస్సుకు ఉత్సాహంతో తరలివచ్చారు. 378 ఒప్పందాలు కుదుర్చుకుని, మొత్తంగా 13,41,734కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు సంకల్పించారు. దీంతో, సుమారు 6లక్షలకు పైగానే ఉద్యోగ అవకాశాలు కూడా వస్తాయని అంచనా. ఈ సదస్సు ఆద్యంతం దిగ్విజయం కావడంతో రాష్ట్రం త్వరలోనే ఒక అద్భుతమైన పారిశ్రామిక హబ్‌గా ఆవిర్భవించబోతోందని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికత్వానికి ఇదొక చక్కని నిదర్శనమంటూ దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వెల్లడవుతున్నాయి.

## 'జగన్ మార్కు సదస్సు'

తాను చేసే తప్పుడు పనులను మంచి పనులుగా చూపించి, జర్మన్ దేశ ప్రజలని, మీడియాని తప్పుత్రోవ పట్టించి తన పరపతి దెబ్బతినకుండా ఉండడానికి 'జోసెఫ్ గోబెల్స్' అనే తన సన్నిహితుడిని కీలక పదవిలో నియమించుకుని రాజ్యమేలాడు హిట్లర్. గోబెల్స్ హిట్లర్‌కి అనుకూలంగా ప్రాపగాండా చేసినా, అదంతా తప్పుడు ప్రచారమని అందరికీ అర్ధమయ్యేది. అప్పటినుండే అవాస్తవ ప్రచారానికి గోబెల్స్ ప్రచారం అని పేరొచ్చిందని మనకి చరిత్ర చెప్తోంది. ఆంధ్రాలో కూడా అదే జరుగుతోంది. ప్రభుత్వంలో కొంత శాతం లోపాలున్నా వాటికి మరికొన్ని జోడించి గోబెల్స్ ప్రచారం చేస్తున్నాయి ప్రతిపక్షాలు. ఆంధ్రాలో ప్రత్యేకంగా ప్రతిపక్షాలన్నీ ఒకవైపు, జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఒక వైపు. ఇదే ఆయన బలం-బలహీనత కూడా. తాను ఏం చేయదలుచుకున్నా మరొకరిపైన ఆధారపడవలసిన అవసరం లేదు. తన నిర్ణయాన్ని ఎదిరించే ధైర్యం ఎవరికీ లేదు. ఇదే ఆయన బలం. ఎన్నికల వేళ ఒంటరిగా పోరాడాలి, ఆయన మాటల్లో చెప్పాలంటే "దుష్టశక్తులన్నీ ఏకమై వచ్చినా ఒంటరిగానే ఎదుర్కోవాలి"... ఇది ఆయన బలహీనత. ప్రతిపక్షాలు చేస్తున్న గోబెల్స్ ప్రచారాన్ని ఎలా తిప్పికొట్టాలో, ఎప్పుడు ఎక్కడ స్పందించాలో ఆయనకు బాగా తెలుసు. ఎలాంటి సమయంలో ఏ అంశాన్ని పైకి తీసుకురావాలో ఆయనకి తెలిసినంత బాగా ఇంకెవరికీ తెలియదు. తనకు అవసరమైన అస్త్రాలన్నీ అమ్ములపొదిలో దాచుకుని సిద్ధంగా ఉండడం ఆయన నైజం. ఎక్కడ దేని అవసరముందో అక్కడ ఆ అస్త్రాన్ని ప్రయోగించడం జగన్‌కి వెన్నతో పెట్టిన విద్య. అలాంటి తన వ్యూహంలో 'భాగమే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'. ఇది విశాఖలో పెట్టడం వెనుక కూడా జగన్ మార్కు వ్యూహం ఉంది. విశాఖకు వచ్చే ప్రతి ఒక్కరిచేత విశాఖను పొగిడించి అక్కడ రాజధాని ఏర్పాటుకి మార్గాన్ని సులభతరం చేసుకోవాలి. ఇంకోవైపు ఇన్ని లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు తన హయాంలో హామీలు వచ్చాయి కాబట్టి మళ్ళీ తనకే అధికారం ఇస్తే అవన్నీ కార్యరూపం దాలుస్తాయి. అందుకే ఆయన ఈ విషయంలో మరో అడుగు ముందుకేసి, విశాఖలో కుదిరిన ఒప్పందాలను కార్యరూపం దాల్చడానికి ప్రధాన కార్యదర్శి పర్యవేక్షణలో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఎన్నికల స్టంటులా కాకుండా రాష్ట్ర అభివృద్ధికి అంకితభావంతో, అకుంఠిత దీక్షతో ఈ పెట్టుబడులను కట్టుబడులుగా మార్చగలిగితే తన తండ్రి రాజశేఖరరెడ్డిలాగా జగన్‌మోహన్‌రెడ్డి పేరు కూడా రాష్ట్ర రాజకీయ చరిత్రలో శాశ్వతంగా ఉండిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.




## 8వ వర్ధంతి

మీరు మాపై చూపించిన ఆత్మీయతానురాగాలు
మేము ఎన్నటికి మరువలేము.
మీ జ్ఞాపకాలు మా హృదయాలలో
పదిలంగా వుంటాయి. మీ పవిత్ర ఆత్మకు
శాంతిని కలుగజేయమని భగవంతుని ప్రార్ధిస్తూ...

స్వర్గీయ శ్రీమతి ఆలూరు సుజాత
కోవూరు (మరణం : 10-03-2015)

భర్త : ఆలూరు శ్రీనివాసులు రెడ్డి
కుమారులు - కోడళ్లు :
ఆలూరు ప్రదీప్ రెడ్డి - సుష్మ
డా॥ ఆలూరు స్వరూప్ కుమార్ రెడ్డి - రూప

మరిది - చెల్లెలు:
ఆలూరు అనిల్ కుమార్ రెడ్డి - శోభన
కుమార్తె : డా॥ సుస్మిత - పిడతల భాస్కర్ రెడ్డి
కుమారుడు : ఆలూరు శ్రీకాంత్ రెడ్డి - సాహితి

మనుమలు, మనుమరాండ్రు మరియు కుటుంబసభ్యులు - పాటూరు రోడ్డు, కోవూరు


# కళ్యాణ వైభవం...!



నెల్లూరులోని 'శాంతి' హైరర్స్ అధినేత వూటుకూరు వెంకటేశ్వరరావు - లక్ష్మిల కుమారుడు **హర్షవర్ధన్ - ఉషాచంద్రిక** (సబ్బవరం వాస్తవ్యులు పులిగా శంకరరావు - జ్యోతిల కుమార్తెల కల్యాణం మార్చి 8వ తేదీ నెల్లూరులోని శ్రీ కస్తూరిదేవి గార్డెన్స్ నందు వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



ప్రముఖ కవి అవ్వారు శ్రీధర్‌బాబు - నిర్మలల కుమారుడు **శ్రీకర్ - కీర్తన** (నెల్లూరు వాస్తవ్యులు సుంకర శ్రీనివాసులు - వాణిల కుమార్తెల వివాహం మార్చి 9వ తేదీ నెల్లూరులోని డా. జెట్టి శేషారెడ్డి కళ్యాణ మండపం నందు ఘనంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

## అభినందన కలయిక

ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డిని నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని వారి నివాసంలో కలుసుకున్న ఎమ్మెల్సీ మేరిగ మురళిని ఆత్మీయంగా స్వాగతించి, శాలువతో సత్కరించి అభినందిస్తున్న ప్రభు.





## బిజెపి అభ్యర్థులను గెలిపించండి

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి బలపరచిన అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కుట్టుబోయిన బ్రహ్మానందను గెలిపించాలని బిజెపి రాష్ట్ర అధికారి ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి కోరారు. ఆత్మకూరులో ఇటీవల ఆయన ఆ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. బిజెపి అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి విజయం సాధించి పెట్టాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బిజెపి సీనియర్ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, కరటంపాటి సుధీర్, సుమంత్, భరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ వాకర్స్..మహిళా దినోత్సవం

నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న వెలమసంఘం భవనంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి మెడికల్ చీఫ్ ఆఫీసర్ డాక్టర్ టి.శ్రీలక్ష్మి పాల్గొని, క్యాన్సర్ వ్యాధి పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వాకర్స్ 203 గవర్నర్ వెంకటాద్రిరెడ్డి, 2022 ఇంటర్నేషనల్ ట్రెజరర్



నలుబోలు బలరామయ్య నాయుడు, వాకర్స్ ప్రతినిధులు ఏకొల్లు రాఘవరెడ్డి పాల్గొని వాకర్స్ దంపతులను సన్మానించారు. వాకర్స్ సంఘం అధ్యక్షులు తలపనేని హరిబాబు, కార్యదర్శి బిరదవోలు రామమోహన్‌రెడ్డి, కోశాధికారి షేక్ నజీర్‌అహమ్మద్, భారతి, శ్రీమన్నారాయణ, ఆర్.సుబ్బారావు, కె. సుబ్బారావు పాల్గొన్నారు.

# నెల్లూరులో.. 'సంగీత పండుగలు'



## ○ భక్తిగానాలతో పులకించనున్న టౌన్‌హాల్
## ○ 12 నుంచి 19 వరకు శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు

నెల్లూరులో భక్తులకు వీనులవిందు చేసే సంగీతపు పండుగల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎంతో ప్రసిద్ధ మైన భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు మార్చి 12వ తేది ఫాల్గుణ బహుళ పంచమి ఆదివారం రోజు నుంచి ప్రారంభం కాబోతున్నాయి. త్యాగరాజ స్మరణోత్సవాలంటే సంగీతపు పండుగలేన స్మృది అందరికీ తెలిసిందే. అద్వితీయమైన త్యాగరాజస్వామి సంకీర్తనలతో, పంచరత్న గోష్టి గానాలు, అనేకరకాల వాద్య కచేరీలతో, భక్తి గాన కచ్చేరీలతో టౌన్‌హాల్ ప్రాంగణం పులకించిపోతుంది. ఎప్పుడో 57 ఏళ్ళ కిందట అచంచలమైన భక్తిశ్రద్ధలతో శ్రీ త్యాగరాజస్వామి ఆరాధకులు, విఖ్యాత హరికథా కళాకారులు శ్రీ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి (గానగంధర్వుడు పద్మశ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తండ్రిగారు), వారి మిత్రులు డా.యనమండ్ర వేంకటేశ్వరశాస్త్రిలు నెల్లూరు నగరంలో జోలె కట్టి, భిక్షపట్టి సంగీతసేవ కోసం నడుంబిగించారు. ఎంతో దీక్షతో, సమాజంలో భక్తిభావాన్ని పెంపొందించాలన్న కృషితో.. ఒక తపస్సుగా ఈ భక్తి సంగీత కార్యక్రమాలను అద్వితీయంగా నిర్వహిస్తూ, నెల్లూరును మరో తిరువయ్యార్ అనిపించేలా చేసిన ఖ్యాతి ఆ మహనీయులది. ఎంతో వ్యయప్రయాసలతో కూడినప్పటికీ, దేశవ్యాప్తంగా ప్రసిద్ధులైన ఎందరో సంగీత విద్వాంసులను వారు నెల్లూరుకు ఆహ్వానించి, అద్భుతమైన ఆ భక్తిగానాలను నెల్లూరు ప్రజలు వినే పుణ్యం కట్టుకున్నారు. అందరి సహకారంతో, ఆ భక్తి పరంపరను, ఆ సంగీత వారసత్వాన్ని నేటికీ కొనసాగిస్తూ, శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలను నేటికీ అదేస్థాయిలో కొనసాగిస్తున్నారు శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ నిర్వాహకులు. ఇవి 58వ త్యాగరాజ స్మరణోత్సవాలు. ఈ ఉత్సవాల ప్రారంభం రోజున, మార్చి 12వ తేది ఉదయం 7 గంటలకు స్థానిక వేదాయపాలెంలోని త్యాగరాజనగర్‌లో ఉన్న శ్రీ త్యాగరాజ స్వామి మందిరం నుంచి శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్సమేత శ్రీ త్యాగరాజ ఉత్సవ విగ్రహాలను, త్యాగరాజస్వామివారి చిత్రపటాన్ని ఊరేగింపుతో నగరంలోని టౌన్‌హాలుకు తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారు. కలశ స్థాపన చేసి, పూజలు నిర్వహిస్తారు. అనంతరం ప్రతిరోజు గాత్రకచేరీలు, వాద్య కచేరీలు, భక్తిగానాలతో ఉత్సవాలు భక్తులకు వీనులవిందు చేస్తాయి. నెల్లూరు పురప్రజలే కాక దూరప్రాంతాల నుంచి కూడా సంగీతాభిమానులు ఈ వేడుకలకు వచ్చి ఆ మధురగానాలను, వాద్యనాదాలను విని తన్మయులవుతుంటారు. ఈ ఉత్సవాలు మార్చి 18వ తేది వరకు వైభవంగా జరుగుతాయని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ కార్యదర్శి యనమండ్ర నాగదేవిప్రసాద్ కోరారు.

# మంచిదే! పోలవరం పూర్తి కాకపోవడం మంచిదే..!

అదేదో టీవీ ప్రకటనలో వచ్చే 'మంచిదే. మరక మంచిదే...' లాగా, మంచిదే, పోలవరం ప్రాజెక్ట్ పూర్తి కాకపోవడం మంచిదే. రాజశేఖరరెడ్డి హయాంలోనో.. చంద్రబాబునాయుడు హయాంలోనో.. 1980లో ఒరిజినల్ శంకుస్థాపన రాయి వేసిన అంజయ్య హయాంలోనో అది పూర్తయ్యి ఉంటే, దానిని తలుచుకునే వారు ఉండేవారు కాదు గదా! ఎండకు ఎండుతూ, వానకూ... వరదకూ తడుస్తూ....దాని మానానా అది నడుస్తూ ఉండేది.

ప్రకాశం బ్యారేజ్‌ని, నాగార్జునసాగర్‌ను, శ్రీశైలం ప్రాజెక్ట్‌ను, జూరాల ప్రాజెక్ట్‌ను ఇప్పుడు ఎవరైనా తలుచుకుంటున్నారా?

ఏదో... మన నాయకుల పుణ్యమా అని పోలవరం ప్రాజెక్ట్‌ను ఇప్పుడు మనం రోజూ తలుచుకుంటున్నాం. ముందు ముందు కూడా తలుచుకుంటూనే ఉంటాం. ఇంత మంది జనం నోళ్ళల్లో నానడానికి... అది ఎంత అదృష్టం చేసుకుందో గదా అనిపిస్తుంటుంది.

ఇందుకు సగం క్రెడిట్ 'ఇటలీ మాత'కు ఇవ్వాలి. కాంగ్రెస్‌పార్టీకి జున్ను ముక్క లాంటి ఆంధ్రప్రదేశ్‌ను అబ్బాయి కోసమని తెగనరికి, 'పోలవరం' అనే క్యాబేజ్ సైజు పువ్వును తెలుగువారి చెవిలో పెట్టింది. దీంతో, మన నేతలకు 'రాజీ నామా'లు చెయ్యాల్సిన గండం తప్పింది. ఎవరి స్థాయిలోవారు... మెగా పువ్వుల దగ్గరి నుంచి చిన్న చిన్న లిల్లీపూల వరకు.... జనం చెవుల్లో పెట్టారు.

'పోలవరం జాతీయ ప్రాజెక్ట్' అని అమ్మ చెప్పింది. 'కేంద్రమే కట్టేసి, పునరావాసుల కష్టసుఖాలు కేంద్రమే చూసేసి, ప్రాజెక్ట్‌ను తీసుకొచ్చి తెలుగువారి చేతుల్లో పెట్టేస్తాం అని అంది. దీనిముందు, హైదరాబాద్ ఎంత అంది. దీంతో, కొన్నాళ్ల పాటు పోలవరం ప్రాజెక్ట్ తెలుగువారి నోళ్ళల్లో బాగా నానింది.

విభజన 'తంతు' పూర్తయ్యాక, అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు, 'పోలవరం జాతీయ ప్రాజెక్ట్ అన్నారుగా? ఎప్పుడు పూర్తి చేస్తారు? చెయ్యండి మరి..!' అంటూ కేంద్రం వెనకాల పడి ఉండాల్సింది. కానీ, పడలేదు.

"మీరు కడితే ఆలస్యం అవుతుంది. మీకెందుకు శ్రమ? మీరు డబ్బులు ఇవ్వండి. మేమే కట్టుకుంటాం" అంటూ పోలవరం గుదిబండను చంద్రబాబు.. తన మెడలో వేసుకున్నారు. అది గుదిబండ అని ఆయనకు అప్పుడు తెలియలేదు.

కేంద్రం మాత్రం.. పోలవరం ప్రాజెక్ట్ ఆథారిటీ అంటూ ఒక సంస్థను సృష్టించి, చేతులు దులిపేసుకుంది.

పోలవరం ప్రాజెక్ట్‌లో సవాలక్ష కాంట్రాక్టులు, ఉపకాంట్రాక్టులు, బినామీ కాంట్రాక్టులు. చివరకు, చూట్టానికి వచ్చే సందర్శకులకు భోజనాలు పెట్టే మెస్‌కూ కాంట్రాక్టే.

ఇవన్నీ దక్కించుకున్న తెలుగుదేశం వాళ్ళను చూస్తూ, వైసీపీ వాళ్లకు కడుపు రేవై పోయింది. మొత్తం తినేస్తున్నారంటూ కేంద్రానికి ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేశారు. స్టేట్‌మెంట్ల మీద స్టేట్‌మెంట్లు జనం మీదికి వదిలారు. ఆ విధంగా అది జనం నోళ్ళల్లో బాగా నానుతూ వచ్చింది. పోలవరం ప్రాజెక్ట్‌ను కట్టుకో అని రాయపాటి సాంబశివరావు తాలూకు కాంట్రాక్టు కంపెనీకి చంద్రబాబు ముందు రాసిచ్చేశారు.

2019 ఎన్నికలు వస్తున్నాయి అనే వాతావరణంలో రాయపాటి వారి కంపెనీకి సెలవు ఇచ్చి, నవయుగ విశ్వేశ్వరరావును రంగంలోకి దింపారు. రాయపాటి వారికి బదులుగా, ముందే నవయుగ విశ్వేశ్వరరావుకు పోలవరం అప్పగించి ఉంటే... 2019 ఎన్నికల నాటికే అది వినియోగంలోకి వచ్చేది.

కానీ, రాజకీయాలు పాపిష్టివి కదా! మరీ 2019 నాటికే పోలవరం పూర్తయిపోతే, 2019 ఎన్నికలకు మంచి టాపిక్ ఉండదని చంద్రబాబు ఒకవేళ అనుకున్నారేమో తెలియదు గానీ, పోలవరం సగం సగం పూర్తయింది. 70% పూర్తి అయింది అన్నారు.


"మళ్ళీ గెలిపించండి. పోలవరం నిర్మాణం మిగిలిన 30పర్సెంటు పూర్తి చేస్తాం..." అంటూ చంద్రబాబు ఎన్నికలకు వెళ్లారు. జనం గెలిపించలేదు. 'పులివెందుల బిడ్డ'గా రాష్ట్రం అంతా తెలిసిన జగన్‌మోహనరెడ్డిని గెలిపించారు.

చంద్రబాబునాయుడు మొదలు పెట్టింది ఏదైనా సరే... కొనసాగించడం అనేది జగనన్నకు ఇష్టం ఉండదు.

ప్రజావేదిక చంద్రబాబు కట్టించారు, జగన్ దానిని కూల్చేయించారు. అమరావతిని చంద్రబాబు మొదలుపెట్టారు... జగనన్న దానిని ఆపేశారు. అలాగే పోలవరం నిర్మాణాన్ని చంద్రబాబు మొదలు పెట్టారు. జగనన్న వచ్చి నవయుగ కాంట్రాక్టర్‌ను తీసేసి, మేఘా ఇంజనీరింగ్‌ను ప్రవేశపెట్టారు.

అనిల్‌కుమార్‌యాదవ్‌ను ముందు, అంబటి రాంబాబును తరువాత నీటి పారుదల శాఖ మంత్రులుగా నియమించారు.

ఎందుకో గానీ, మంత్రులుగా కంటే... తెలుగు




దేశం పార్టీ, చంద్రబాబుపై విరుచుకుపడడంలో చెప్పలేనంత ప్రచారం వారికి వచ్చింది. దాంతో, పోలవరం సంగతేంటి అంటూ పోలవరం పాత మంత్రి దేవినేని ఉమా రోజువారీ విమర్శలకు దిగడంతో, పోలవరంకు మంచి పబ్లిసిటీ వచ్చింది.

మధ్య మధ్యలో తెలుగుదేశం సభ్యుడు కనకమేడల రవీంద్ర రాజ్యసభలో ఒక ప్రశ్న వేస్తుంటారు, పోలవరంను ఏం చేశారు అని. "మాదేం లోపం లేదు. ఇవ్వాల్సింది ఇచ్చేశాం. మీ రాష్ట్ర ప్రభుత్వమే కట్టడం లేదు" అని కేంద్ర జలవనరులశాఖ మంత్రి చెబుతారు.

"చంద్రబాబు వల్లే పోలవరం పూర్తికాలేదు. డబ్బులన్నీ తినేశారు. బహిరంగ చర్చకు సిద్ధమా?" అని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి సవాలు విసురుతారు. ఇదంతా మంచి కాలక్షేపం.

ఆ మధ్య ఎప్పుడో కాఫర్ డ్యామ్ కొట్టుకు పోయిందని.. కొట్టుకుపోతుందని.. కొట్టుకుపో వచ్చని.. కొట్టుకు పోదామా అని అనుకుంటుందని.... ఇలా, విమర్శలు.. ప్రతి విమర్శలతో... పోలవరం జనం నోళ్ళల్లో బాగానే నానింది. ఇప్పుడు డయాఫ్రమ్ వాల్ ఏదో కొట్టుకుపోయిందనో.. పోదామా అని అనుకుంటున్నదనో వార్తలు.



"చంద్రబాబు సరిగా కట్టకే, అది కొంత కొట్టుకు పోయింది" అని ప్రస్తుత నీటిపారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు.

"పోలవరం ఇప్పటికిప్పుడు కట్టేయడానికి మేం తొందర పడడం లేదు. నాణ్యత ముఖ్యం. తాపీగా కడతాం" అని ఆయన అసలు విషయం చెప్పారు. ఇంకా ఏడాదిలోపే ప్రస్తుత అధికార కాలపరిమితి ఉంది. ఈలోపు పోలవరం పూర్తిచేసే ఆలోచన లేదని అంబటి రాంబాబు చెప్పేశారు.

నిజమే మరి. నాణ్యత లేకుండా, పోలవరం కడితే... ఓ వర్షం కురిసిన రాత్రి వరదలు బిళ్ళబీటుగా వచ్చేసి... పోలవరం బ్యారేజీ తెగితే...!!

అందుకే, అర్రీ బుర్రీగా పోలవరం ప్రాజెక్ట్ కట్టాలని ప్రభుత్వ పెద్దలు అనుకోడం లేదు. దీంతో, పోలవరం పాత మంత్రి దేవినేని నెహ్రూకు బోలెడంత కాలక్షేపం. రోజూ జగన్‌ను, అంబటి రాంబాబును తిట్టిపోయొచ్చు. శాపనార్థాలు పెట్టొచ్చు. మధ్యలో కేవీపీ రామచంద్రరావు ఒకరు. చంద్రబాబు ఉన్నప్పుడు, "నువ్వు అది చెయ్యలేదు. ఇది చేశావు..." అంటూ చంద్రబాబుకు ఉత్తరాలు రాసేవారు. చంద్రబాబు సమాధానాలు ఇచ్చేవారు కాదు. ఇక, లాభం లేదనుకుని... కేవీపీ ఏకంగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. "నేనూ ఇంప్లీడ్ అవుతున్నానోహో..." అంటూ రాజమండ్రి పూర్వపు ఎం.పీ ఉండవల్లి అరుణ్‌కుమార్ కూడా రంగంలోకి దిగేశారు. ఇది ఎప్పటికి తేలేనో తెలియదు. ఈలోగా పోలవరం... పోలవరం అంటూ జనం మాట్లాడుకోవడం మాత్రం ఆగదు. ఎందుకంటే, ఆ పోలవరం బ్యారేజ్ ఇప్పట్లో పూర్తి కాదు. ఎందుకంటే, మనకు రాజకీయాలు కావాలి. కులాలు కావాలి. కాంట్రాక్టులు కావాలి. వీటికి సాయం చేయడానికి పోలవరం స్టోరీ అలా ఉండాలి.

ఏం? అది లేకముందు జనం బతకలేదా? పంటలు పండలేదా? కరెంటు లేదా? ఒక్కసారి అది పూర్తయిపోతే, దాని పేరు ఎవరైనా తలుస్తారా? ఎన్నికల ప్రచారానికి అది పనికి వస్తుందా? ఎన్నికల ప్రచారానికి పనికి రానిది ఏదైనా నిరర్థకమే కదా!

నాగార్జున సాగర్ కడతాం... అని ఏ పార్టీ అయినా అంటుందా? మా పార్టీకి ఓటేస్తే శ్రీశైలం ప్రాజెక్ట్ కడతాం.... ఇదే నా హామీ అని ఏ నాయకుడైనా అంటాడా? మాకు ఓటెయ్యండి.... జూరాల ప్రాజెక్ట్ కట్టాకే ఓట్ల కోసం వస్తా అని ఏ నాయకుడైనా శపథం చేస్తాడా? రాజకీయాలకు, నేతలకు అవసరానికి పనికిరాని ప్రాజెక్టులు ఉన్నా ఒకటే. లేకపోయినా ఒకటే.

నెహ్రూ, నీలం సంజీవరెడ్డి సాగర్, శ్రీశైలం వగైరా కట్టేసి, ఇప్పుడు వాటి పేర్లు కూడా ఉచ్చరించే అవకాశం నాయకులకు లేకుండా చేశారు.

ఇక ఉన్నది ఒక్క పోలవరం మాత్రమే. ఎన్నికల వాగ్దానానికి ఆదుకుంటుంది. అది కూడా పూర్తిగా పూర్తయిపోతే, ఇక రాజకీయాలు దిక్కు, మొక్కు లేకుండా పోతాయి. నిజానికి, రాజకీయాల పాలిట పోలవరం ఒక బహుళార్థ సాధక ప్రాజెక్ట్. ఎన్నికల నినాదంగా పనికొస్తుంది. రాజకీయాల్లో ఉన్నవారు పరస్పరం దుమ్మెత్తి పోసుకోడానికి పనికి వస్తుంది. రాజకీయాలన్న తరువాత బోలెడన్ని ఖర్చులు. తడుముకోకుండా అవన్నీ సర్దుతుంది.

మరి, పూర్తయిపోతేనో! దానిని పలకరించేవారు ఉండరు. అందుకే, పోలవరం పూర్తి కాకపోవడం మంచిదే!

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

## కొర్రపాటి వారి కళ్యాణం

# కమనీయం.. రమణీయం.. చిరస్మరణీయం!



**శ్రీ కే.వి.రత్నం - శ్రీమతి పద్మావతి రత్నం గారల**

గారాల మనుమడు

## సాయిరోహిత్

## లక్ష్మీరోహిత

ఆకాశమంత పందిరిలో..
భూదేవంత అరుగుపై
ముక్కోటి దేవతల సాక్షిగా..
మూడుముళ్ళ బంధంతో
ఏకమవుతున్న శుభతరుణంలో..
వారి కళ్యాణం
కమనీయం.. రమణీయం.. చిరస్మరణీయం
కావాలని ఆకాంక్షిస్తూ...
ఆత్మీయ అభినందన శుభాకాంక్షలు.







**కమనీయ వేడుక**
తేది: 10.03.2023 శుక్రవారం
సమయం : రాత్రి 7.36 గం.లకు

**డాక్టర్ కేశవ్ రామిరెడ్డి**
**శ్రీమతి అనుపమ రామిరెడ్డి**
టాంపా, ఫ్లోరిడా, యుఎస్ఏ

**రమణీయ వేదిక**
విపిఆర్ కన్వెన్షన్ సెంటర్
గొలగమూడిరోడ్డు, నెల్లూరు.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com